బాలానంద

పల్నాటి వీరచరిత్ర



రచన:
నాగశ్రీ

Acc no
2067

నవరత్న బుక్ సెంటర్
ఏలూరు రోడ్, * విజయవాడ-520002

బాలానంద పల్నాటి వీర చరిత్ర

రచన : నాగశ్రీ

ప్రథమ ముద్రణ :
డిశంబర్ 1998

ముఖచిత్రం : వి. ఎస్. ప్రకాష్

C
398.2 109 [illegible]
NAG

ప్రచురణ హక్కులు :
శ్రీ బి. కె. ఆర్. మూర్తి
28-22-20 అరండల్ పేట
విజయవాడ-2
ఫోన్ : 432813

ముద్రణ :
బాలాజీ ప్రింటింగ్ ప్రెస్
విజయవాడ-4

వెల : రు. 25-00

విషయసూచిక

అలనాటి వలనాటి సీమ
అదృష్టవంతుడు-అనుగురాజు
క్రొత్తమంత్రిగారి కుటిలబుద్ధి
నాయకురాలు నాగమ్మ కథ
నాగమ్మ నొప్పించిన నరసింగరాజు
నిలకడ పడుతూన్న నలగామరాజు
నరసింగ రాజాడిన నవనాటకము
మహారాజు నెదిరించిన మలిదేవాడులు
న్యాయపాలన చేసిన నలగామరాజు
మాచర్ల నగర నిర్మాణము
నాగమ్మ పన్నిన పన్నాగము
మాచర్ల నోడిపోయిన మలిదేవాడులు
తిరిగి రాలేకపోయిన అలరాజు
త్రిపురాంతకం చేరిన మలిదేవాడులు
కారెమపూడి చేరిన మలిదేవాడులు
భంగపడిన భట్టు రాయబారము
కారెమపూడి చేరిన నలగామాడులు
బాలచంద్రుడాడిన బొంగరాలాట
అత్తకోడండ్రు చేసిన క్రొత్తాలోచన

ACC NO
2671

సానితో సరసాలాడిన బాలచంద్రుడు
అత్తవారింటికి వచ్చిన అందాల బాలుడు
మాంచాల దీవెనలు పొందిన మంత్రి కుమారుడు
ముత్యాలహారము-ముద్దుటుంగరములు
మలిదేవుని దర్శించిన బాలచంద్రుడు
యువక సోదరుల యుద్ధోన్మాదం
బాలచంద్రు డాడిన పోటు మాటలు
అనబోతు పంపించిన ఆనవాలు
తినబోవు ముద్దలు తీర్థముపాలు
సంధికుదరని సంగ్రామము
రణభూమి కరుదెంచిన నరసింగరాజు
నరసింగరాజు బాలచంద్రుల మరణము

అలనాటి పలనాటి సీమ

అలనాటి పలనాడు—

అందాల పలనాడు - చందాల పలనాడు - అపరంజి పంటల పలనాడు - అమరవీరుల పలనాడు—మన పలనాడు.

కొనరాని వెలలేని కోహినూర్ వజ్రం పుట్టిన పురిటిగడ్డని చరిత్రకారులచే చాటి చెప్పబడిన పలనాడు, ప్రఖ్యాత వజ్రాల పంటభూమిగా గణికెక్కింది. ఢిల్లీ చక్రవర్తి బాబరు కుడిచేయిలో కళకళలాడి, షాజహాను చక్రవర్తికి ప్రాణసమానంగా పరిగణింపబడి పారశీకవాదరుషాను, పరవశమొందించి- ఆఫ్‌గన్ స్థానాధీశ్వరుని అభిమానాన్ని చూరగొని - హైందవ రాజులకొలువు కూటాలలో అభినందల నందుకుని తరువాత ద్వీపాంతరమున కేగి రవి యస్తమించని సామ్రాజ్యపాలకులయిన పంచమ చక్రవర్తి మకుటము నలంకరించి వెలుగొందినది. మన నేల బుట్టిన కోహినూర్ వజ్రమే నన్న ఘనత మనకు దక్కింది.

పలనాటిసీమలోని తమ్ముకోటచెంత మల్లవరంచెంత కూడ వజ్రపు గనులున్నవి. మొగలాయిరాజుల పాలనాకాలంలోనూ యీ గనులలో విశేషంగా

పనులు జరిగినట్లు "మెమోరిన్ ఆఫ్ ది జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా" అను పుస్తకం నేటికిని చాటి చెబుతూంది.

పలనాటిసీమలో లోహాలుకూడ వున్నవి. కారెమపూడి యొద్ద సీసం విస్తారంగా లభించింది. అలాగే వినుకొండయందు పల్నాటి తాలూకాయందును రాగి మరియు ఇనుము దొరికినట్లు చరిత్ర తెలుపుతూంది. గుత్తికొండ గ్రామాన పూర్వ మొకప్పుడు లోహముల కరిగిన కొలుముల బాపతు గుర్తు లీనాటికిని కన్పడు చున్నవి. అచటి తిప్పలతో నొకదానికి ఇనుపకొండ యను పేరు వచ్చినది. అంతే గాక, నాడీ ప్రాంతమందలి భూగర్భ పరిశోధనలు చేసి వానిని తీయించినవారు నివసించిన పల్లె యీనాడు "కొలుములపాలె"మను పేరున పిలువబడు చున్నది కూడాను.

పలనాటిసీమకు రాజధాని గురిజాల. పూర్వమొకప్పుడిచట గురువింద పొదలు మిక్కుటంగా నున్నందున దీనిని గురిజాల అన్నారట. గురిజాల కృష్ణా నదీ తీరమునకు రమారమి నూటయిరుపది మైళ్ళ దూరమున నున్న నగరం. ఉత్తర పడమరలుగా కృష్ణానదీ ప్రవాహమిచట డెబ్బయిదుమైళ్ళు పారుతూంది. దక్షిణమున కొండలు సాంద్రారణ్యమును, తూర్పున చిట్టడవులు నాగులేరు, చంద్రవంక నదులు కలిగినందున నీ ప్రదేశం పల్లమునందుండుటచే పల్లవునాడు, పలనాడని నాడు చెప్పబడి నేడు పలనాడు, పల్నాడు నామముల దాల్చి చరిత్రలో వీరపల్నాడుగా వినుతికెక్కింది. ఇచటి చంద్రవంకనే చంద్రభాగమనియు చెప్పబడుచున్నది. కాని చంద్రభాగమని ప్రసిద్ధిగాంచిన నదిమాత్ర మిదికాదు. నాగులేరునకు నాగానదియని యింకొక పేరున్నది.

పూర్వమిచ్చట నాగజాతివారు నివసించినందున యీ ప్రవాహానికి నాగు లేరను పేరువచ్చినట్లు జనవదంతి విన్పట్టుచున్నది. పల్నాటిసీమ దండకారణ్యంలో ఒక త్రేతాయుగంలో రావణబ్రహ్మ ఖంధువులు, పరివారంలోని వారైన ఖరదూష ణాదులచే పాలింపబడినదని పురాణ ప్రసిద్ధియు కలదు. రామాయణ కాలములో మారీచుడు పాలించినచోట వెలిసింది. మాచిర్లయని- ఖరుడు పాలించినచోట వెలి సింది. కారెమపూడియని- దూషణుడు పాలించినచోట వెలిసిందీ దుర్గయనిగూడా యిచటి జనవాడుకలు వినబడుచున్నవి. నేటి ఈ పలనాటిసీమ వెలిసినచోటునందే నాడు విశ్వామిత్ర మహాముని సత్రయాగం చేసినట్లును చెప్పబడుతూంది.

ఈ పలనాటిసీమను క్రీస్తుశకం పన్నెండవ శతాబ్దంలో చందవోలు నేలు ప్రభువు తన కల్లుడైన అనుగురాజుకు అరెణముగ నీయబడింది.

అదృష్టవంతుడు అనంగురాజు

అది ఉత్తరభారతదేశమందలి బాలపాంచాలపురం, దానినే జంఘనాపురి అనికూడా అంటారు. ఆ రాజ్యానికి వారసుడు అనుగురాజు. కార్తవీర్యార్జునుని సంతతివాడయినందున హైహయవంశీయుడని తెలుస్తూంది. ఆయన తండ్రి వీర కామేంద్రుడు కార్తవీర్యునిగా అవతరించాడని అంటారు.

అదృష్టదేవత యెప్పుడూ ఒకచోటనే యుండదు. అనుగురాజు దశ తారు మారయింది. ఉన్నచోటు నొదిలేసి పోవలసి వచ్చింది. అవస్థలందున్న వారికి అను

మానాలు పెచ్చు జ్యోతిషశాస్త్రిల నడిగాడు. ఆ బ్రాహ్మణులాయనకు నీపూర్వీకు డైన కార్తవీర్యార్జునుడు చేసిన పాపాలు నిన్ను పట్టి పీడస్తున్నవి. నీవు జీడినూనె బట్టలు ధరించి సకుటుంబముగ తీర్థయాత్రలు చేస్తుండగా నీ మేనిగుడ్డలు తెల్లబడి నపుడు నిన్నీ పాపా లొదిలిపోతా" యని చెప్పాడు.

అవమానాలకు అనుమానాలకు గురియైన అనుగురాజుకాలోచనలేక "కార్త వీర్యార్జునుడు చేసిన పాపాలు మా వంశంలో యెవరి జోలికిపోకుండ నన్నొకనినే యెందుకు పట్టుకున్నవి!" అని అడుగలేకపోయాడు. మంచి రోజు చూచుకుని తీర్థయాత్రలకు బయలుదేరాడు. ఆయనలాగా వచ్చి దక్షిణ భారతదేశంలో అమరావతి యొద్ద కృష్ణలో మునిగినంత వాని జీడినూనె బట్టలు తెల్లబడినయి. అంతటితో వానికి చందవోలు పరిచయం కలిగింది. చందవోలు నేలు ప్రభువు తన కుమార్తె మైలమదేవిని అనుగురాజునకిచ్చి వివాహంచేసి పలనాటిసీమ పణముగా యిచ్చాడు.

నాడు తొలగిపోయిన అదృష్టము నేడు కలసివచ్చిన అనుగురాజునకిపుడు తాతముత్తాతల నాటి పాపాలు తప్పిపోయినయి. గొప్పవారి చుట్టరికం కూడ వచ్చింది. పాలించుకొన పలనాటిసీమతో బాటు మైలమదేవి పట్టపు రాణిగా లభించింది-ఆయనకిపుడు గురజాల రాజధాని. దొడ్డమనాయుడు మంత్రి అయ్యాడు.

చేతినాయకుడు వెంకటగిరి సంస్థానాధీశ్వరులైన వెలుగోటివారి వంశానికి చెందిన పద్మనాయక వెలమ వంశీయుడు. రేచర్లవారు చేతి నాయకుని కుమారుడు దొడ్డనాయుడు, దొడ్డనాయునకు బాదరాజు, బ్రహ్మనాయుడు, సూరినీడు, పేరినీడు, మల్లినీడను వారై దుగురు కుమారులు. వారిలో బాదరాజును పెద్దన్నయని-బ్రహ్మ నాయుని బ్రహ్మన్నయని కూడా అంటారు.

అనుగురాజుకు పట్టపురాణియైన మైలమదేవి తరువాత భూరమాదేవి వీర విద్యాదేవి యనే భార్యలిద్దరున్నారు. ఆయనకా ముగ్గురు దేవేరులవలన కూడా కొందరగా సంతానం కలుగనందున మంత్రి దొడ్డనాయుని కుమారులలో పెద్ద వాడైన బాదరాజును దగ్గరకు తీసికొని కన్నకుమారునివలె పెంచాడు. అది చూచిన జనమంతా "బాదరాజు అనుగురాజుకు పెంపుడు కొడుకు" అనుకున్నారు.

కొంతకాలం గడిచింది— రాణుల కడుపులు పండినాయి.

మైలదేవికి నలగామరాజు, భూరమాదేవికి కామిరాజు, నరసింగరాజు, ముట్టిరాజు, పెరుమాళ్ళరాజులను నలువురు కుమారులు- వీరవిద్యాదేవికి పెదమలి దేవ, పినమలిదేవ, బాలమలిదేవులను ముగ్గురు కుమారులు కలిగారు. ఆ కారణాన అనుగురాజుకు స్త్రీ సంతానం లేకపోయినా పురుష సంతానానికి లోటు లేకపోయింది వారంతా బాదరాజును పెద్దన్నయ్యని పిలుచుచుండెడివారు. బాదరాయని కిపుడు కంచర్లపురము నేలు కృష్ణగంధర్వుడను క్షత్రియని కుమార్తె లవాంఙతో వివాహంచేసి ఒక చిన్న నగరపాలకునిగా నియమించాడు అనుగురాజు.

దొడ్డనాయుడు పెద్దవాడయినందున బ్రహ్మనాయునికి మంత్రి పదవి లభించినది.

క్రొత్త మంత్రిగారి కుటిల బుద్ధి

అనుగురాజుకు పెంపుడు కుమారుడై పలనాటిసీమకు ప్రభువు కాగలడనుకున్న పెద్దన్నకా పెద్దరికం దక్కలేదన్న కొరతచేతనో యేమోగాని క్రొత్తగా మంత్రి పదవికి వచ్చిన బ్రహ్మనాయుని కారాజుమీద...రాజ కుటుంబం మీద నిజమైన ప్రేమాభిమానాలు లేకపోయినను, బ్రహ్మనాయుడు గుండెధైర్యం కలవాడు మంచి

మేధావి. మనసులోని యాలోచన మరియొకరికెంత మాత్రమూ పసిగట్టనీయడు. రాజకీయ చతురత యందాతనికున్న పాండిత్యం సాటిలేనిది. కడుపులో కాలకూట విషమున్నా పెదవిమీది తేనె పలుకులతో ప్రజలలో పరువు ప్రతిష్టలు సంపాదించుకున్నాడు. పల్నాటి శ్రీకృష్ణుడన్న పేరాయనకు ప్రత్యేక గౌరవ స్థానం. ఆయనగారి అడుగుజాడల దాటని అభిమాన వర్గం...ఆ వెనుక రహస్యభట వర్గం గూడ యేర్పడింది.

ఒకప్పుడు అనుగురాజు వేటకు బయలుదేరాడు. ఆయన పరివారంలోనే బ్రహ్మన్న—బ్రహ్మన్న మంత్రి ఆంతరంగిక మిత్రులుకూడా వున్నారు. చాలా సేపు వేటాడిన రాజు అలసిడస్సిపోయిన సమయం. బ్రహ్మన్నగారు ముందుగా నియమింపబడిన అనుయాయు లందొక్కడు యేదియో జంతువును చంపబోయినట్లుగా అనుగురాజుమీద బాణం నాటాడు. అనుగురాజుకి కెవరిమీద యెటువంటి యను మానాలు లేనందున జరిగింది, నిజంగా ప్రమాదమేనని నమ్మాడు. బ్రహ్మనాయుని చేరబిలిచి "నాకు కాలం తిరిబోయింది. ఇకమీద నా కుమారులు తండ్రిలేని బిడ్డలగు చున్నారు. వారిని నీవే పెంచి, పెద్దవారిని చేసి, వారికి న్యాయం కలిగించ"మని చెప్పి ప్రాణాలు విడిచాడు.

మంత్రిగారి ఆలోచన మంత్రంలా పనిచేసింది.

బ్రహ్మన్న యిపుడు రాజ్యానికి సర్వాధికారి అయ్యాడు. ఆయన ప్రజలకే గాకుండ రాజ కుటుంబానికిగూడ దేవుడయ్యాడు. రాజ్యాంగ ధర్మం ననుసరించి తండ్రి పెద్దకొడుకైన నలగామరాజుకు పట్టం కట్టి ప్రభువుని చేశాడు.

మంత్రిగారిపుడు మహాధర్మంగల సంఘ సంస్కర్తలయ్యారు. పంచములైన మాల, మాదిగ వారల నానాడు పెద్ద కులాలవారు తాకనిచ్చెడివారుకారు. పంచ

ములు దేవాలయాలలోనికి రారాదనే నిబంధనలుండేవి. నిజానికది మంచిపనిగాదు. బ్రహ్మనాయుడా కాలంలో సనాతన మతాన్నెదిరించి పంచములకు దేవాలయ ప్రవేశాధికారం కలిగించాడు. అంతవరకైతే చాలా బాగుండేది. దాని చాటున కొన్ని సభ్యతలేని దురాచారాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి, అని నరసింగరాజు మొదలయినవారి గట్టి నమ్మకం. నరసింగరాజు నలగామునికి సోదరుడే గాకుండా పలనాటి రాజ్యానికి సర్వసైన్యాధిపతి కూడాను.

బ్రహ్మనాయుడు తన కభిమాన కుమారుడైన మాల కన్నమదాసును దళాధిపతిని చేశాడు. అది నరసింగరాజుకు గిట్టలేదు. మంత్రిగారినెదిరించడానికి సిద్ధమయ్యాడు. కాని వాని రాజకీయ చతురత ముందు తప్పు తప్పుగా నిరూపించి చూపగల శక్తియుక్తులు లేక వెనుకాడుతున్నాడు.

పంచమ దేవాలయ ప్రవేశం చాటున మంత్రిగారు చూపకూట సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టాడు. అన్నంవండి చాపమీద రాశిపోస్తారు. దానిప్రక్క పాకాలు గూత యుంటాయి. ఏ కులమైనాసరే, ఎవరయినాసరే నిరాటంకంగాపోయి రాశిలోని అన్నం చాపమీద కలుపుకుని తిన్నంతతిని పోవాలి. తరువాత వచ్చినవారా మొదటివాడు తినిపోయిన మెతుకులలోనే మరికొంత కలుపుకుని తిని పోతుంటారు ఒకప్పుడు కొందఱుగా కూడా యీ చాపమీద తింటుంటారు. దీనివలన కుల మత భేదాలను కూలద్రోస్తున్నామని వారు చెప్పే మహోపన్యాసం.

నిజానికి సర్వమానవ సహపంక్తి భోజనాలంటే ఇవికావు. ఇందువలన సాధింపగల మహోదయమంటూ లేదు. ఇదొక మొంగిలి మంగలమేనని నరసింగరాజు కోపకు చెందిన గుణవంతుల వాదం. అమాత్యుల వారి యరాచక మంతటితో ఆగినదియు లేదు.

నాయకురాలు నాగమ్మ కథ

నాగులేటి యొడ్డున జిట్టగామాలపాడు. రామిరెడ్డి చౌదరి వీదకుటుంబానికి చెందిన పంటకాపురెడ్డికి సంతానంలేదు. ఒకనాడాయన భూమి దున్నేటందుకు పొలం పోతూండగ బాట ప్రక్కన పూపొదలో బాలరోదనం వినపడింది. ఆయ నటు పోయి చూచాడు. చూడ చక్కదనాల పాపాయి కంటపడింది. ఎత్తి ముద్దా డాడు. ఆమెకు సంబంధించిన వారెవరూలేరని నిర్ణయించుకున్నాక దొరికిన బిడ్డను ఇంటికి తెచ్చి ఇల్లాలిచేతి కిచ్చాడు. ఆమె మురిసిపోయి ముద్దులాడింది.

రామిరెడ్డి చౌదరి తిరిగిపోయి పొలంలో అరక గట్టాడు. వాని వెనుకనెవరో యుండి "నేనుకూడా నీ ఇంటికి వస్తాను. నన్నుగూడ తీసికొనిపో" అన్నట్లు మాటలు వినబడినాయి. ఆయన దిక్కులన్ని తిరిగిచూచినా యెవరూ కనపడలేదు. మళ్ళ యెద్దుల నదిలించాడు. భూమిని దున్ను నాగలి మొనకేదో ఖంగుమని తగిలింది. దానిని పరిలిశించి చూచిన రెడ్డిరైతు నిశ్చేపం కనులచూశాడు...చాళ్ళు దున్నేషని చాలించి ఇంటికివచ్చి భార్యతో చెప్పాడు.

ఆ రాత్రికి రైతు దంపతు లొక మేకపోతును తోలుకొని పోయి నిక్షేపం ముందు బలియిచ్చిన తరువాత నమస్కారాలు చేసి చేతికందిన మహాలక్ష్మిని ఇంటికి చేర్చుకున్నారు. బిడ్డవచ్చినవేళ— గొడ్డు వచ్చినవేళ అన్నట్లుగా వారింట సిరిసంపదలు చిందులాడినాయి. అన్నట్టు ఆ పాప వానికా పూపొదలోని నాగేం ద్రుని పుట్టమీద దొరికినందున వారామెకు "నాగమ్మ" అని నామకరణం చేశారు. నాగేంద్రాంశం నాగమ్మకు తప్పకుండా వచ్చింది. మేకపోతు సింగారెడ్డిగారు నాగమ్మకు మేనమామలు.

చదువుకునే యీడురాగ తల్లిదండ్రులామెను గోపన్నమంత్రి దగ్గర విద్యాభ్యాసం చేయించారు. సంస్కృతాంధ్ర భాషలలో పండితురాలయింది. రాజకీయంలో ప్రతిభ సంపాదించింది. అశ్వారోహణ గజారోహణలో ఆరితేరింది. యుద్ధనైపుణ్యంలో నుత్తీర్ణురాలయింది. నాగమ్మకు సాటి నాగమ్మే ననిపించుకుంది.

నాగమ్మకు పదునెనిమిదవయేట అరవిల్లి ఓబులరెడ్డిగారి ఏకైక కుమారుడు సింగారెడ్డిగారితో వివాహం జరిగింది. మహా శ్రీమంతులు. కాని విధి బలీయ మగుట ఆమె పెండ్లినాటి పూలజడ వాడకముందు - నొసటి కుంకుమబొట్టు చెదరక ముందే - కంటికాటుక కనుమాయకముందే సింగారెడ్డి చనిపోయాడు. నాగమ్మ పతి నంటని సతి. మరికొన్ని దినాల కత్తమామలుగూడ చనిపోయినందున అత్త వారింట పెత్తనం చేజిక్కింది. అటుమీద తల్లిదండ్రుల అనంతరం పుట్టింటివారి మహా ఐశ్వర్యం కూడ వచ్చి కలిసింది. ఆమె యిపుడొక జమీందార్ స్థాయికి జెందిన శ్రీమంతురాలయింది. రాజ కుటుంబముతో పరిచయము గూడ సంపాదించుకుంది.

ఆ రోజులలో బందిపోటు దొంగలముఠా లెక్కువగా గ్రామాలమీద పడి దోచుకుంటున్నారు. గ్రామాలకు రక్షణ కావలసివచ్చింది. నాగమ్మ యువజన సంఘాలు సమకూర్చుకుని వారికి సాముగరిడీలు పూర్తిగా నేర్పింది. అంతేకాకుండా కొంత గజదళం, అశ్వదళం, భటదళాలనుకూడా నేర్పాటు చేసింది. ఆ కారణంగా రెడ్డిగారి నాగమ్మ నాయకురాలు నాగమ్మగా పేరు పొందింది.

ఆమెకు శంకరు డారాధ్యదైవము. ఆమె యిక చేయదగిన పనులేవీ లేవనుకుంది. ధనలోపము జనలోపము లేని సంపన్నులైనందున నగరికి సమీపము

నందున్న ఒక అడవిలో ఆశ్రమము నిర్మించుకొని శివపూజలతో కాలము గడుపు తుంది.

నాగమ్మను నొప్పించిన నరసింగరాజు

నాగమ్మ తన దినచర్యల ననుసరించి ఉదయకాల శివపూజాదులు పూర్తి చేసుకుని ఆశ్రమము ముందు చెట్లనీడన కూర్చుంది. ఆమె మనసునందెందుకో గాని గడిచిపోయిన ఒకనాటి రాజకీయ ఘట్టాలు స్ఫురణకు వచ్చినై. అంతలోపే వాని లోకి పోవాలనుకుని పెదవి విరిచింది. అనుకొనకుండగానే "నాగమ్మా !" అనే పిలుపు వినబడింది.

తలెత్తి చూసింది నాగమ్మ —

"నరసింగరాజుగారా! దయచేసి కూర్చొనండి. మహారాజులు-సేనాధిపతులు మమ్ము చూడ వచ్చిన కారణము వినసిద్ధముగ నున్నాను" అన్నది.

"నీతో కొన్ని రాజ్యాంగ విషయాలు మాటాడాలనే వచ్చాను."

"అభ్యంతర మేముంటుంది ? — చెప్పండి."

"మీరు రాజ్యాంగ రంగములో ప్రవేశించాలని మా కోరిక"

నరసింగరాజుగారూ! ఆ కాలము గడిచిపోయి చిరకాలమయింది. మిగిలిన నా ఈ జీవితాన్ని భగవత్సేవ కంకితం జేయాలని యీ మూలకువచ్చి కూర్చున్నాను. నన్నెందుకు మళ్ళీ ఆ మహాసంగ్రామము లోనికి యీడ్చుకొని పోతారు.

"ఇది నా కోసముకాదు" నీ కోసమంతకంటెకాదు. కాని పలనాటిరాజ్యంలో బ్రహ్మనాయుని నాయకత్వాన అన్యాయాలకు గురియై అలమటించి పోతూన్న మహిళామణుల మాన మర్యాదలను కాపాడడానికిమాత్రమే. పాడైపోతూన్న పసి

కాపురాలను కాపాడి, నీ సాటి స్త్రీ జాతికి న్యాయము కలిగించేటందుకు నీవు గుర జాల రాజకొల్వులో మంత్రిణి పదవి నిర్వహించాలని నా కోరికేకాదు - ప్రార్థన కూడాను."

ఆ మాటకు తిరుగు చెప్పలేక పోయిన నాగమ్మ "అంటే ?" అన్నది.

"అదే చెప్తున్నాను. నాయుడుగారిపుడు నడుపుతూన్న పంచమ దేవాలయ ప్రవేశమైతే మాకు గూడ సంతోషమే- మరొక విధంగా గర్వకారణము కూడాను. ఆ పంచమ దేవాలయ ప్రవేశ మహాశయము వెనుక చాపకూటి సిద్ధాంతము. దాని చాటున అంతకంటె భయంకరమైన కామవిలాసం. అది కంచుకోత్సవం. కామ తృప్తి పండుగలలాంటి పచ్చిబూతనములో పొరపాటుండదు. హద్దుపద్దులులేక, నీతి నియమంబులు లేక పూపులమీద వ్రాలు తేనెటిగలలాగ యధేచ్ఛా లైంగిక వ్యాపారము అదొక సాంప్రదాయంగా స్త్రీ పురుష సంయోగం వినోదమైనపు డింక భార్యా భర్తలు కాపురాలేం చేయగలుగుతారు ? — ఎలా చేస్తారు ?

"నిజమేనంటారా !"

అద్దంలో చూస్తూకూడా అనుమాన మెందుకు ? బ్రహ్మనాయుని కొడుకు బాలచంద్రుడు బంగారంలాంటి తన భార్య మంచాలవంక కన్నెత్తిచూచి యెరుగడు. యీ అన్నగారల్లుడు అలరాజు రత్నాల నేరమ్మ, గుమ్మం త్రొక్కినవాడు కాడు. మహారాజుగారల్లుడు మహామంత్రిగారి కుమారులే యీ స్థితికి దిగజారిపోయినపుడు ఊరుపేరు లేని సామాన్య ప్రజలింకెందరీ మహాదారుణ సాంప్రదాయంలో కూరి పోయి యుంటారో గమనింపదగిన విషయం. అందువలన బాధపడే ప్రజలింకెవరి లోనీ ప్రళయం తప్పించమని చెప్పుకొన గలరో నీవాలోచించాలి.

"నాయుడుగారేమంటున్నారు ?"

ఆయననొక తేనెపూసిన కత్తి. ఈ యనాచారానికి జీవంపోసి పెంచుతున్నది మంత్రిగారే. నాయునికి పెమ్మసాని ప్రియురాలు. పెమ్మసాని కొడుకు కన్నముడు. వారీయనకు కరమున బుట్టిన అభిమాన పుత్రుడట. అనగా బ్రహ్మన్న పలనాటి శ్రీకృష్ణుడగు దైవాంశ సంభవుడని, వారి వరప్రభావమున కన్నముడు కలిగెనె, కాని బారుణిసంభవు డెంతమాత్రమును కాడని అమాయకుల మూఢనమ్మకం. బ్రహ్మన్న వాక్ప్రభావంచేతనే పెమ్మసానికి సంతానం కలిగినపుడు బతమ్మకు బిడ్డలులేక అంతకాలమన్ని నోములు నోచి అంతమంది దేవతల నారాధించుపెందులకని యడిగిన వాడు లేకపోవుట శోచనీయం. కన్నమజాసేగోక చాకలి నందు, కుమ్మరి పట్టి మొదలైనవారు కూడ నాయునిగారి అక్రమ సంతానమే. ఆయా స్త్రీల భర్త లలో కొందరు మహామంత్రి నెదిరింపలేక తలలువంచక తప్పడం లేదు. మరికొందరు పుక్కిట పురాణములను నమ్మినందున వారి భార్యల కిట్టి భాగవతోత్తములతో సంతానం కలగడం అదొక ఘనకార్యమని గూడ నమ్మినవాళ్ళు లేకపోలేదు.

దీనికి మీరేం చేయదలచుకున్నారు ?

స్త్రీలకు మాన మర్యాదలు దక్కాలంటు, యువకులు వారివారి భార్యలతో కాపురాలు చేయాలంటె, మీరు మా కొలువున మంత్రిజిగచేరి నాయుడుగారాట కట్టించడమే మొదటిసారిగా జరుగవలయు ననుకొనుచున్నాను. దీనికుపాయం గూడ మీరే యోచించాల. అన్న నరసింగరాజుతో నాగమ్మ సరేనన్నట్లుగ తలాడించి "రెండు మూడు రోజులలో మార్గమాలోచించి మి దగ్గరకు మనిషిని పంపుతా" నన్నది. నేనిక పోయివస్తానంటూ నరసింగరాజు లేచి వెళ్ళిపోయాడు.

నిలకడపడతూన్న నలగామరాజు

చేది దేశంనుండి దక్షిణ భారతావనికి వచ్చి, చందవోలు ప్రభువుతో చుట్టరికం చేసి, పలనాటికి పాలకుడైన అనుగురాజు కుమారుడు నలగామరాజు. తండ్రి తరువాత తండ్రి రాజ్యానికి రాజయ్యాడు. ఆయనకింకా సవతితల్లుల కుమారులైన తమ్ముళ్లెద్దురున్నారు. ఈ ప్రాంతంలోనే బాంధవ్యం పెంచుకోవాలనుకున్నాడు.

ఆ కాలాన నిజాం రాజ్యమందలి బీదరుకు ముప్పదయిదు మైళ్ళ దూరాన నున్న కళ్యాణమును పశ్చిమ చాళుక్య వంశపు రాజులు పాలిస్తున్నారు. క్రీ.శ. పదివందల సంవత్సరాల తరువాత దేశమంతటా చోళరాజుల పాలన విస్తరించింది. వారిలో ముఖ్యంగా రాజమహేంద్రవరం పాలించిన రాజరాజనరేంద్రుడులు తూర్పు చాళుక్యులైతే కళ్యాణము నేలినవారు పశ్చిమ చాళుక్య వంశీయులు. ఈ కళ్యాణం పాలించిన వారిలో ముగ్గురు సోముల తరువాత నాల్గవ సోమభూపాలునకు ముఠారి సోమదేవర, వీరబిజ్జల, సోమేశ్వరదేవరలను బిరుదములున్నవి. ఆయన కెడ్డురు కుమారులు ఒక కుమార్తె.

నలగాముడు తన సోదరులలో వీరవిద్యాదేవి పెద్దకుమారుడైన పెదమలి దేవునకా వీరసోముని కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అంతేకాకుండా తమ్ముని బావమరుదులు లోనివాడైన కొమ్మరాజు రాజమల్లు అను అలరాజునకు తన వైశ్య కుమార్తె రత్నాల పేరమ్మనిచ్చి పెండ్లిచేసి-ఎప్పటికయిన యిల్లరికంపు టల్లుడేగదాయని అల్లుని-బావనుగూడ తన యొద్దనే యుంచుకున్నాడు.

మలిదేవుని బావమరిది కుమారునికి పిల్లనిచ్చినందున తన తమ్ముడు తన కింక దగ్గర కాగలడని నలగాముని యాలోచన. సవతి తల్లుల కొడుకులకే తేడా కనపడకుండ అన్నదమ్ముల అనురాగం పెరుగుతుందనుకున్నాడు నలగామరాజు. కాని అలా జరగలేదు. జరుగనీయలేదు మహామాత్యులవారు. తాను పంచమ దేవాలయ ప్రవేశాన్ని చాటు బెట్టుకుని చేస్తున్న అరాచకానికి రాజు సుముఖంగాలేడన్న సంగతాయన మొదటనే పసిగట్టాడు. సర్వాధికారైన రాజెప్పుడైన తన ఉద్యమాని కంతరాయం చెప్పవచ్చు. అందుకని ముందాలోచనగల బ్రహ్మనాయుడు కొన్ని కీలకాలు తన గుప్పిట పట్టుకోదలంచాడు. నలగాముడాయన దారికడ్డు తగిలితే, అప్పుడు తానాడవలసిన రాజకీయ చదరంగంలో నుపయోగపడే పావులులాగా మలి దేవాదులను తీర్చిదిద్దుకున్నాడు.

బ్రహ్మనాయుడు నడిపించే చాపకూటి రుచితో బాటు అవినీతి రుచులు గూడ జీర్ణించుకున్న మలిదేవాదుల కిపుడాయననే మార్గదర్శి. ఆ మాయదార్లో మైకంలో పడిపోయిన కొమ్మరాజు మొదలైనవారికి గూడ నాయుని యాన నాతాయణమూర్తి యాజ్ఞవంటిది. వారిపుడు మలిరాజును వీడి నలగామునివంక చూడడం లేదు.

నిజానికారాజ్యం మైలమదేవి పుట్టింటి వారిచ్చినందున స్త్రీ ధనమయింది. మాతామణులిచ్చిన సొత్తుకు మనుషుడే సర్వాధికారిగావి వాని సవతితల్లుల పిల్లల కెటువంటి యధికారములేదు. వలగాముడు తన తమ్ములని దయచూడకపోతే మలి దేవాదులకక్కడ నిలువనీడలులేవు. నలగామునకు మగసంతానం లేనందున్న రత్నాల పేరమ్మ రాజ్యానికి వారసురాలు. పేరమ్మ పేరుమీదుగ కాటోవురాజు అలరాజు. ఆ కారణంగా తండ్రికొడుకులైన కొమ్మరాజు అలరాజులకు నల్లగాము

రాజు మీద నిజమైన ప్రేమాభిమానాలున్నా-లేకపోయినా రాజ్యసింహాసనం తమ చేతికి చిక్కిందాకనైన మహారాజున కనుకూలంగా మసులుకోదగిన వారైకూడ మలిదేవుని పక్షంచేరి బ్రహ్మనాయుని చేతిలో మంత్రించిన మరబొమ్మలు కావడం శోచనీయం.

నలగామునికిది తెలియనిదేమీకాదు. కాని పరిస్థితులు చేదాటి పోయినయి. ఇప్పుడెవరి నేమనడానికి సావకాశాలు లేకపోయాయి. అలరాజెంత పేరమ్మ నాద రింపక పోయినా కూతురుమీది కూర్మితో వియ్యాల వారితో విరోధం పెట్టుకోలేక బోనులోపడ్డ సింహంలా చిక్కుబడిపోయాడు.

నరసింగరాజు నలగామునికి యింకొక నవతికల్లి కుమారుడు అయినప్పటికి కళ్యాణపురం బాంధవ్యరీత్యా మలిదేవుడు వచ్చినంత తగ్గరకు రాలేకపోయాడు. కాకపోయినా మేమంతా అనుగురాజు రక్తం పంచుకొని పుట్టిన అన్నదమ్ములమన్న అభిమాన మాయనలో మూర్తీభవించింది. అన్నగారి ఆత్మ విచారం అర్థం చేసుకొనిన బుద్ధిమంతుడు కూడను. తమ్ముడుగా, సేనాధిపతిగా, రాజసేవకుడుగా తన జీవితాన్ని సమర్పించిన మహాశయ సంపన్నుడు నరసింగరాజు. నరసింగరాజు లోని న్యాయదక్షత సోదరప్రేమను గూడ అవగాహన చేసుకున్న నలగామున కిపుడీ తమ్ముడే నమ్మదగిన యాత్మీయుడయ్యాడు.

నరసింగ రాజాడిన నవనాటకము

ఒకనాడు నలగామ భూపతి పరివారాన్ని వెంటబెట్టుకుని వేటాడ బయలు దేరాడు. వారిలో నరసింగరాజు కూడ వున్నాడు. అడవినంతా కలియతిరిగి వేట

డిన రాజపరివారమంతా అలసిపోయింది. అప్పటికి ప్రొద్దు నడిమింటికి వచ్చినందున యెండకూడ తీవ్రమయింది ఎండలో కష్టపడిన వారికి దాహపీడనము అధికమయింది. ప్రతి మనిషి మంచినీటికై తపించిపోయే సమయంలో నరసింగరాజు "అన్నయ్యా! నాయకురాలు నాగమ్మ నివసించే ఆశ్రమం సమీపమునందే యున్నది. మన రాక తెలుసుకుని మనకై పచ్చాకు పందిరి వేయించి అల్పాహారము లీయడానికి కంటూ ఆహ్వానమంపింది కూడాను. మనమిపుడా చలువపందిరిలో విశ్రాంతి తీసుకొనుటయు మంచిదే ననుకుంటాను. మీరేమంటారు?" అన్నాడు.

"అనేదేమున్నది తమ్ముడూ! అంతగా పిలిచినపుడు పోకపోవడ మెందుకు? అందులోను నాగమ్మ యనిన నాకు మంచి యభిప్రాయమున్నది. దైవమను గ్రహించినేదేని మేలు జరుగ గలదు. కాకపోయినను మనకిప్పు డవసరములయిన ఒనరులు సమకూడనున్న చోటునకు పోవడమే మంచి"దన్నాడు. నరసింగరాజు వారందరును వెంటబెట్టుకుని నాగమ్మ ఆశ్రమానికి చేరుకున్నాడు. పోయిన వారందరకక్కడ పందిరి క్రింద నీడ లభించింది. చల్లగాలి వీచుకొన విసనకర్రలు దొరికినై. తినడానికి పండ్లు, త్రాగడానికి చెఱుకురసం సమకూడినై, నలగాము డంతట నాగమ్మతో "యీనాడు నీవు చేసిన ఈ యుపకారము మరచిపోలేని" దన్నాడు.

"పరోపకారం చేయడంలో నాగమ్మకు పెట్టిన పేరన్నగారూ!" అంటూ అందుకున్న నరసింగరాజు "ఆమె తలచుకుంటె బ్రహ్మనాయుని దురంతాలనంత మొందించి ప్రజాభ్యుదయం ప్రతిపాదించగల సమర్థురా" లన్నాడు.

నాకేదో గొప్పతన మంట గట్టుతున్నారన్నది. నాగమ్మ నవ్వుతూ.

"అంటగట్టితే గొప్పతన మంటుకొనేది కాదు నాగమ్మా! మా గురజాల పరిస్థితులు నీకు తెలిసే యుండవచ్చును. మహామాత్యులవారు నడుపుచున్న పంచమ దేవాలయ ప్రవేశోద్యమం చాటున జరిగే" — అని యింకా చెప్పబోతున్న నరసింగరాజు మాట కడ్డు వచ్చిన నాగమ్మ "నాకు తెలియనిది కాదులె" మన్నది. నరసింగరాజు తిరిగి "మీరీ సమయంలో గురజాల మంత్రిపదవిని చేపట్టి జరుగుతున్న కుళ్ళును కడిగివేస్తేనే కాని—

నిజమే—అని ఆగిపోయింది. నాగమ్మ.

సందేహం దేనికి—అన్నాడు నలగామరాజు

"చూడండి! రాజపదవి యెంత భోగ ప్రదమయిందో యింకొక రూపంగ అంత భయంకరమయింది కూడను, ధర్మపాలన అనేది సామాన్యమైన పనికాదు. ప్రజలలో శాంతి భద్రతలు నెలకొల్పడానికి - అంటే ఎదురయ్యే వ్యతిరేక శక్తుల నణచి వేయుట పట్ల ప్రభువు లొకొక్కప్పుడెంత త్యాగమయినా చేయవలసి వస్తుంది. గురజాల పాలకుల కవియన్ని తెలియవని నేను చెప్పడంలేదు—చెప్పగల దాననుకూడ" కానన్నది నాగమ్మ.

మీరీ విషయంలో జోక్యం కలిగించుకొనడానికి—

మనవి చేస్తున్నాను మహారాజా! మీరాజ్ఞాపించినపుడు నేను మారిపోగల దాననుకాను. కాని, సర్వాధికారులు లోక విషయాన్ని గమనించవలసియుంటుంది. ప్రభూ! మీకూ తెలిసినదే...పదవీవ్యామోహం నాకు చాలా దూరం ధనలోపంచేత

పొట్టనింపుకోనడానికి రాజాశ్రయం కోరే పని నాకు లేదు. నాయుని మీద పంతం నాకంతకన్న యుండదు. ఐతే పంచమ దేవాలయ ప్రవేశమనే మహాశయాన్ని ఆస్కారంగా పెట్టుకొని, ఆ తెరచాటున జరుపుతున్న మంత్రిగారి మహాదారుణా చారాన్ని నిరోధించి ప్రజలందరకు న్యాయం కలిగించే ధ్యేయంతో నేనేది చేసినా ప్రభువులు నా కంతరాయం చెప్పరా!" దని సూటిగ అడిగింది నాగమ్మ.

అందుకే ఎదురు చూచుచున్నా నన్నట్లుగా నలగామరాజు వెంటనే "నాగమ్మా! నాకు కావలసింది ప్రజాభ్యుదయం పాలనా విధానంలో యిటువంటి పొరపాటులు లేకుండ చక్కగా తీర్చిదిద్దే నీ రాజకీయ వ్యవహారాలకు "నేనే మాత్ర మంతరాయం చెప్పనని పరమేశ్వర పాదసాక్షిగా ప్రమాణం చేస్తున్నా" న్నాడు.

నాగమ్మ కూడ "ఐతే వినండి ప్రజాభ్యుదయాన్ని ప్రధానాంశంగా పెట్టుకొని, ఎదురైన దుష్టశక్తులను తుడిచిపెట్టడానికి రాజకీయ రంగంలో నేనే తంత్రం పన్నినా-శాసనములు పరచినా నా స్వార్థానికిగాని వ్యక్తిగత ద్వేషాలకుగాని స్థానముండదని నేనా పరమేశ్వర పాదసాక్షిగ ప్రమాణం చేస్తున్నా" నన్నది.

నరసింగరాజంత లేచి నాగమ్మగారు వెంటనే అమాత్య పదవీ స్వీకారం చేయాలంటూ నాటి సమావేశాన్ని ముగింపు చేశాడు.

మహారాజు నెదిరించిన మలిదేవాడులు

నాగమ్మ అడుగుపెట్టిన తోడనే రాజకుటుంబంలో కలహం తలయెత్తింది. బ్రహ్మనాయుని యెదిరించడానికి నాంది నాగమ్మ నిరసించిన పంచమ దేవాలయ ప్రవేశమయింది. దానితో నాయుడుగారికి తలమీద పిడుగు పడినంత పనయింది. పంచములను దేవాలయ ప్రవేశావకాశం కావాలని నాయుడు అక్కఱలేదని నాగమ్మ చేసిన వాద ప్రతివాదాలు తీవ్రరూపందాల్చినై, నలగామరాజెటూ మాటాడలేదు. బ్రహ్మనాయుని కది తలవంపుగా తోచినందున "ఈ కొలువులో నా దాధ్యత నేటితో తీరిపోయింది"అంటూ మంత్రి పదవికి రాజీనామా ఇచ్చి యెవరిమాట కెదురు చూడకుండా చరచరా సభమండి వెళ్ళిపోయాడు.

నాటికి కొలువు ముగిసినది.

మరునాడు మళ్ళీ రాజు కొలువు దీరాడు. బ్రహ్మనాయుడుగూడ సభకు విచ్చేశాడు. కాని తన మామూలు మంత్రిస్థానం విడిచి సామాన్య ప్రజలలో కూర్చున్నాడు. మలిదేవాదులు వారివారి స్థానాల వారాక్రమించారు. కొంతసేపటికి బ్రహ్మన్న లేచి, "మహారాజా! మాదొక విన్నపం — మన్నించాలి" అన్నాడు. ఏనాడూ వినబడని యీ క్రొత్తమాటలు సభలోని వారినందరినీ కలవర పరిచినై. నలగామరాజు "మీరు చెప్పేదేమిటి?" అన్నట్లుగా జారిపంత చూశాడు.

"నలగామ భూపాలా! మీ తండ్రిగారు చనిపోతూ పసివాళ్లైన మిమ్ములను మీ గుర్రాల రాజ్య భంరభారమును నా చేతులలో పెట్టిన సంగతి మీరీ నాటికి మరచిపోయి యుంటారు — అంతే అప్పటికి మీరు చంటిపాపలై నందున — అనాటినుండి ఈనాటివరకు నేను రాజకుటుంబం పట్ల చూపిన విశ్వాసాభిమానాలు తెట్టితో మీకు గాని ప్రజలకుగూడా తెలిసినదే కాబచ్చును. ఆ కాలం గడిచి

పోయింది. ఇప్పుడవన్నీ త్రవ్వుకొనడ మప్రస్తుతం కావచ్చును. నీ విపుడు సర్వాధికారివయ్యావు. నరసింగరాజు స్వతంత్రుడయ్యాడు. మలిదేవాదు లింకా మమ్ము నమ్ముకునేయున్నందున వారి మంచి చెడ్డల చూడవలసిన బాధ్యత తీరలేదు వారి పక్షాన నేనడుగుతున్నాను. అనుగురాజుకు వీర విద్యాదేవియు భార్యయే కనుక సోదర న్యాయంబుగా మలిదేవాదులకు కొంత రాజ్యం పంచి యీయవలసినదిగా కోరుతున్నాను. దాని యాధారంగ నేను వారిని గూడ మీయంత వారిని చేసిననాడు. మీ నాన్నగారికిచ్చిన మాట నిలబెట్టుకుంటా"నని కూర్చున్నాడు.

అందుకు సమాధానమీయ వలసిన నలగామరాజు ప్రశాంతముగనే "అమాత్య బ్రహ్మనాయులవారి యాజ్ఞ మాకవశ్యాచరణీయము, ఐనను రాజ్యాంగ ధర్మ నిర్ణయముల నతిక్రమించి స్వతంత్రించ గల అవకాశముగాని, అధికారము గాని, నాకులేవు. మీరు మాకు తండ్రి యంతటివారు. ఇంతవరకు మేమును తమ మాట తెదురు చెప్పినవారము కామని తెలియని వారెవరునులేరు. మీరనినట్లు నేటి కది కొంత మార్పు చెందింది. ప్రభువులు సర్వాధికారులై నను వారికి కొన్ని పరిధు లున్నవి. రాజును సైతము శాసింపగల ధర్మవాణి ప్రజల ముఖం నుండి వెలువడు తుంది. కావున మీరిపుడు సూచించిన రాజ్య విభాగం పట్ల ప్రజాభిప్రాయము నమసరించిచేయుట కర్తవ్యంతరములే" దన్నాడు.

అన్నగారిచ్చిన అవకాశము ననుసరించి లేచిన నరసింగరాజు "రాజసభా సదులకు నమస్కారం. ఇప్పుడిక్కడ నొక ధర్మచర్చ ప్రారంభమయింది. మా సోదరులలోని వారైన మలిదేవాదులకు రాజ్యభాగం కావాలని మహామంత్రుల వార డుగుచున్నారు. అయితే—యింతకు ముందు ఎక్కడైనా ఎవరైనా రాజ్యమును తమ్ములకు పంచియిచ్చిన అన్నలున్నారా! అని నా ప్రశ్న? రాజ్యము పంచుకొన దగినది కాదు—రాజ్యసింహాసనమును చీల్చుటకేనాడును ధర్మశాస్త్ర మంగీకరించి

యుండలేదు. అను జన్మమెంత ప్రయోజకులైనను—ఎందరయినను రాజ గౌరవ వేతనములను పొందుటకే గాక రాజ్యమున పాలు పంచుకొన నర్హులుకారు. అలా పంచుకునే పరిస్థితిలో భూరమాదేవి బిడ్డలమైన మేమును సోదరులమే. మేమును రాజ్యభాగ మడగమను నిర్ణయమును లేదు. లమాత్యుల వారన్నట్లుగ మలిదేవాదులు పసివారైనందున తెలియక భాగ మడిగిరేమో— ఇంతకాలము మహామంత్రి పదవి నిర్వహించి—రాజ్యాంగ ధర్మముల సాంగోపాంగముగ నెజిఱిగి—యితరులకు చెప్పనేర్చిన మహామంత్రి బ్రహ్మనాయుడుగారే ధర్మశాస్త్రము ననుసరించి రాకుమారులకు పాలీయమను చున్నారో మేము వినగోరు చున్నా"మని కూర్చున్నాడు.

ACCNO. 20671
398.2109548 4
NAG
25-00

ఎప్పుడెప్పుడూ యని ఎదురు చూచుచున్న నాగమ్మ లేచి నిలబడింది. "ధర్మము చెప్పగల పెద్దలకు నా విన్నపము. ప్రస్తుత మీ గురజాల మంత్రి స్థానమున నున్నది నేను. ఇది రాజ్యాంగమునకు సంబంధించిన దగుటచే నేను జోక్యము కలిగించుకొనక తప్పదు. మహారాజా అనుగరాజ నరేంద్రులకు మలిదేవాదులను వివాహమాడిన భార్య యందుదయించిన కుమారులన్నమాట పరమ సత్యం. తండ్రియాస్తిమీద కుమారు లంతరకుమ సమానాధికారములున్న మాటయు న్యాయబద్ధం. అయితే యిది రాజ్యాంగం. రాజ్యాంగ విధానంలేదు. రాజ్య సింహాసనాధికార మొక్క పెద్ద కుమారునకేగాక, మిగిలిన సోదరులు రాజగౌరవ వేతనముల పొందుటకు మాత్రమే సంపూర్ణాధికారులై యున్నారు. అటులయ్యను అది యీ గురజాల రాజకుటుంబానికి మాత్రం సంబంధించుటలేదు. ఏలనన? — వలనాటి రాజ్యం అనుగురాజు స్వార్జితమైన యెడల కుమారులందరును తండ్రిసొత్తు మీదధికారులే.

చంద్రవోలు ప్రభువులు కుమార్తె వివాహకాలమున నీ పలనాడు అల్లున కరెణముగా నీయబడింది. మైలమదేవి తన పుట్టింటినుండి తెచ్చుకొనిన రాజ్యంమీద నామె కుమారునకు మాత్రమే సర్వాధికార మున్నదికాని—మైలమదేవి సవతుల యందుదయించిన వారికి నిలువ నీడలైనను లేవు. స్త్రీ ధనమైనందున ముందొక నాటికైన నిది పేరమ్మకు చెందవలసి యున్నది. కావున మలిదేవాదులు కిచ్చు మాటలాడనైన చోటులేదని నేను తీర్మానించుచున్నాను. కాదని సహేతుకముగా సమర్థింప గలవారున్న నా వాదమును పూర్వపక్షము చేయవచ్చు"నని కూర్చున్నది.

సభలో కొందరి ముఖాలు నవ్వినై, కొందరి ముఖాలు మాడినై. జనంలో రాజ్యం పంచి యీయకపోతే మలిదేవాదులు యుద్ధానికి తలపడతారనే గుసగుసలు బయలుదేరినై. అప్పటి కేమి నిర్ణయింపలేని నలగామరాజు మఱునాటికి వాయిదా వేశాడు.

న్యాయపాలన చేసిన నలగామరాజు

మూడవనాడు మళ్ళీ రాజసభ కొలాహలంగా నిండిపోయింది. ప్రభువులే విధంగా తీర్మానం చేస్తారో వింద్దామని జనమంతా తహతహ లాడుతున్నారు. నలగామరాజు సభలోని వారివంక చూచి "అయ్యలారా ! బ్రహ్మనాయుల వారి సందేశానునుసరించి మలిదేవాదులకు రాజ్యభాగ మీయడమా ! నిరాకరించడమా ! అనేది మన మిప్పుడు పరిష్కరింప దగినదై యున్నది.

నరసింగరాజు సూచించినట్లు రాజ సోదరులకు పాలు పంచుకునే అధికారము లేదు. నాగమ్మ వివరించినట్లు క్షీరవిద్యాదేవి కుమారులు రాజగౌరవ వేతనము పుచ్చుకునే అవకాశమునులేదు, లేకపోయినా రాజ్యకాంక్ష గల రాచబిడ్డ యెవరిమీదనైనను

పోరాడవచ్చును. అప్పుడు బాంధవ్యములు చూడవలసిన పనిలేదు. న్యాయవిచారణ గూడ చేయనవసరముండదు. స్వతంత్ర పాలనాధికారమును కోరుచున్న మలిదేవాదులు యుద్ధం చేయడానికైన వెనుదీయరని నేననుకుంటున్నాను. యుద్ధం వలన ధననాశనం – జన నష్టం కలుగక మానదు. రాజు గత్యంతరం లేకపోయినప్పుడు తప్ప రక్తపాతమున కంగీకరింపరాదు.

మలిదేవాదులు క్రొత్తనగరం నిర్మించుకొనడానికి ద్రవ్యమిస్తున్నాను. ఈ ధర్మం నా తమ్ములందరకు వర్తిస్తుంది. ఇక్కడ అడిగిన వారికొక న్యాయం - అడుగని వారి కింకొక న్యాయం జరుగదు. నాకున్న సవతితల్లు లిరువురు, భూరమాదేవి కుమారులైన కామరాజు నరసింగరాజాదుల కొక ద్రవ్యనిధిని - వీర విద్యాదేవి కుమారులైన మలిదేవాదుల కొక ద్రవ్యనిధిని కేటాయించుచున్నాను. ఇంత మాత్రమున నానుండి చీలిపొమ్మని నేనెవరిని శాసించుటయు లేదు. స్వతంత్ర పాలనము నందఖిరుచి కలిగి క్రొత్తనగరం నిర్మించుకొన దలంచినవారు నిరాటంకముగ వారి కీయబడిన ద్రవ్యమును తీసుకొని పోవచ్చును. లేక నా దగ్గిరనే యుండ దలంచినవారు వారికై విభజింపబడిన యీ నిధిని యిందే కలపవచ్చును. అందులకు యిందులకు గూడ నేనామోదించుచున్నాను" అన్నాడు.

రాజసేవకు లంతట రెండు పల్లెములలో ద్రవ్యమును దెచ్చి రెండు బల్లలమీద నుంచి తిరిగిపోయారు.

నలగాముని మాటలు వింటూనే నరసింగరాజు, నాగమ్మ లొకరి మొగమొకరు చూచుకొని "ధర్మనిర్ణయం జరిగిం"దన్నారు. మలిదేవ బ్రహ్మనాయుడు లొకరిమొగ మొకరు చూచుకొని "మన సంకల్పం నెరవేరింది" అన్నారు. సభలోని ప్రజలంతా ఒకరిమొగ మొకరు చూచుకొని "భళిరా ! మైలమ్మ కుమారా ! ఎంత నేర్పరివయ్యా !" అన్నారు. నరసింగరాజు లేచి "అన్నా ! తండ్రికి పెద్దకుమారుడవు-

ఇంటికి పెత్తనపుదారివి - ధర్మమూర్తివి మాకు నీవే కావాలి. వేరే రాజ్యమక్కర లేదు. నిన్నే సేవించి మా భ్రాతృభక్తి రాజభక్తిని మేము నిలుపుకుంటా"మంటూ ద్రవ్యనిధి పళ్లెరమునెత్తి నలగాముని ముందుంచి, "మనల నింతకాలం నుండి పెంచి పెద్దవారినిచేసి మన మంచి చెడ్డలు చూచిన బ్రహ్మనాయ మహామాత్యులవారి యాజ మాన్యములో మేము నూతన నగర నిర్మాణం చేసికుంటాం" అంటూ ద్రవ్యనిధి పళ్ళెరము నెత్తి నాయుని చేతులలో పెట్టాడు.

మాచర్ల నగర నిర్మాణము

చంద్రవంక నదీతీరాన గురిజాల కారుక్రోసుల దూరంలో మలిదేవాదులు బ్రహ్మనాయుని యాజమాన్యాన మాచర్ల నగరాన్ని నిర్మించుకున్నారు. దానికి పెదమలిదేవుడు రాజు, బ్రహ్మనాయుడు మంత్రి కన్నమదాసు సైన్యాధిపతిగల పదవులు స్వీకరించారు. మాచర్లలో నిర్మింపబడిన చెన్నకేశవాలయం ప్రతిష్ట బ్రహ్మనాయుడు చేశాడు. దేవాలయం విశాలమయింది. సుందరమయింది. నూతన పట్టాభిషేక సందర్భంగా మాచర్ల వారాహాన్వాలు గురజాల కంపించారు. కాని యెవరూ రాలేదు. మహామాత్యులవారే స్వయంగా కట్నాలు గురజాల రాజకుటుంబాని కంద జేశాడు.

కన్నమదాసు మాచర్లవారి సైన్యాన్ని అభివృద్ధి చేస్తున్నాడు.

కళ్యాణము నేలు సోమభూపాలునకు మలిదేవుడు అల్లుడు కొమ్మరాజు అల్లరాజు లాయింటి దాయాదులే, ఇపుడీ మాచర్ల కళ్యాణముల రాజులలో స్నేహం తూడ పెరిగింది - కళ్యాణము మీదికి పరరాజులు దండెత్తి వచ్చినందున సోముడు మాచర్ల రాజుల సాయం కోరాడు. బ్రహ్మనాయుడు దండులకామోడించి కలిపయు

సేనలతో కళ్యాణం రాజులను తోడిపోయి శివపురం రాజుల నోడించాడు. అంతే కాకుండ యుద్ధానంతరం శివపురంమీదపడి ధ్వంసంచేసి అక్కడున్న శక్తిదేవతా మూర్తులను తీసికొని వచ్చి త్రిపురాంతకంలో నిలుపుమన్నాడు. ఆ సమయంలో సైన్యంతోగూడ శ్రీశైలం వచ్చే భ్రమరాంబాదేవికి కుంకుమపూజ మల్లికార్జునస్వామికి సహస్రవిశ్వదళార్చన మహాన్యాస పూర్వకంగా చేయించిన తరువాత విజయగర్వంతో తిరిగివచ్చి మాచర్ల చేరుకున్నాడు.

బ్రహ్మనాయుని భార్య ఐతమ్మ ఆమె కుమారుడు బాలచంద్రుడు. నాయుడు గారు తానారాధించే చెన్నకేశవుని పేర బాలచంద్రుని "చెన్నా" అని ముద్దుగ పిలుస్తుంటాడు. బాలుడు మంచి సొగసైనవాడు. చురుకైనవాడు వానిననుసరించిన వారైదుగురున్నారు. వారంతా బాలుని అన్నా అని అంటుంటారు వారిలో అనబోతను బ్రాహ్మణ బాలుడు ముఖ్యుడు. ఆ బాలచంద్రుడా యల్లరిగుంపును వెంటబెట్టుకుని వీధులలో తిరుగాడే యితర పిల్లలను కొడుతుంటాడు. పోవుచున్న ఐండ్ల చీలలూడ బెరుకుతుంటాడు. ఏమైనాగానీ మహామంత్రిగారి గారాబాల కుమారుడు కనుక వానినెవరేమి అనలేరు.

బాలునికి యుక్తవయసు వచ్చింది. మేనమామ గండుకన్నమనీడు. ఆయన గారి కుమార్తె మాంచాల. మాంచాల సౌందర్యవతి. విద్యావతి వివేకవతి శీలవతి కూడాను. ఆమెను బాలచంద్రునకిచ్చి వివాహం చేశారు. ఆ పెండ్లి సమయంలో ఓ పెద్ద గొడవ జరిగింది. కన్నమనీడు ఓలి కావాలని యడిగాడు. ఐతమ్మ మేమీయమన్నది "నీ పెండ్లినాడు ఓలి యిచ్చారు. మీరన్నివిధాలా బాగున్నారు మనకిది సాంప్రదాయమని" తమ్ముడు చెప్పినా అక్క "ఆ రోజులువేరు. యీ రోజులువేరు ఓలి యిచ్చేదిలే"దన్నది కన్నమనీడు దానికంగీకరించలేదు. ఐతమ్మ అనాటి

ఆడబిడ్డగా- యీనాటి వియ్యపరాలుగా అలిగి ఐదురోజులు పట్టుపట్టింది. కన్నమనీడు తెగబడి నీ వక్కవయినాసరే అలిగినాసరే ఓలి యీయ వలసిందే" నన్నాడు.

ఇక తప్పని సరయింది. ఐండిమీదకెక్కి బ్రహ్మనాయుని యింటిలోని బంగారపు వరహాలను తూరుపార పట్టినట్లుగా చేటలతో యెత్తి రాశిపోయించారు. అందులో చెదిరిపోయి ప్రక్కలబడినవానిని పొల్లు వరహాలంటూ కుప్పబడిన వరహాలలో యేడు కుంచాలు కన్నమనీడు ఓలి తీసుకున్నాడు, బ్రహ్మనాయునికది క్రొత్త వియ్యాలవారిమీద కోపకారణమయింది. కోడలును కాపురానికి తీసుకు రాకుండ మానుకున్నాడు. నిజంగా నాయుడుగారికా యభిప్రాయం లేకపోతే మాంచాలతో స్వయంగా "అమ్మాయీ! లేక లేక కలిగిన ఒక్కగానొక్క కొడుకై నందున బాలుని మేము గారాబంగా పెంచాం. కాని వాడిలా వేళ్యాలోలుడై నిన్ను చూడకుండా వుంటాడని మేమనుకోలేదు.

ఏనాటికైనా నీ కాపురం బాగుండటమే నాకు కావాలి."

"చూడమ్మా ! మీ యత్తగారు నీకు మేనత్తగాని పరాయివారు కారు. మనడి రాజకుటుంబం. నీ పెనిమిటి సంపాదించి నీ కన్నవస్త్రాలీయవలసిన పనిలేదు. కనుక నీవిపుడిలా పుట్టింటనుండే దానికన్నా మెట్టినింట నుండటమే మంచిది. ఎప్పుడైన మొగంచూచి నీ మగనికి నీ యందనురాగం కలుగవచ్చు"నని బ్రహ్మనాయుడని అంతె వారి దాంపత్యం బాగుపడి యుండేది. అలా ఆపడానికి బ్రహ్మనాయుడే ముందుకు రాలేకపోయాడు. తమ మాట కాదని ఓలి తీసుకున్నను కన్నమనీని మీద యీ విధంగా తీర్చుకోవాలని నాయుడుగారే కొడుకు కోడండ్రకు యెడబాటుకు కారకుడయ్యాడని ప్రజలంతా చాటున చెప్పుకుంటున్నారు.

బాలచంద్రుడంతకుముందే తండ్రిగారి మాచర్ల దేవాలయంలోను నడుపు తున్న స్వేచ్ఛావిహీతి రుచికి లోబడిపోయిన విలాసమూర్తి. ఆమీద వేశ్యాలోలుడు వానికింక భార్యతో పనేమున్నది? పాపం మానవతియైన మాంచాల మధుర జీవితం అడవిన గాచిన పండువెన్నెలలా వ్యర్థమైపోతూంది. ఆమె స్థితి చూచిన తల్లి దండ్రులు విచారాన్ని పైకి పొక్కలేకా మనసు నందిమిడించికొననూ లేక కుళ్ళి పోతున్నారు.

నాగమ్మ పన్నిన పన్నాగము

నాగమ్మ చారుల నియమించి యెప్పటికప్పుడు మాచర్ల వార్తలు తెలిసి కొంటూనే వున్నది. సభదీరిన నలగామరాజు మాచర్లలో మలిదేవుడెట్లున్నారని" అడిగాడు నరసింగరాజు లేచి "అన్నా! బ్రహ్మనాయుని తెరచాటు నాటకం నిరా టంకముగా జరుగుతూనే వున్నది. గురజాలలో మాయ నాకు తెలియరాదనే భయ మైన యుండెడిది. ఇప్పుడక్కడ వారి నెదిరించే వారేలేరు. అనాచారం ప్రబల మయింది. అనరాదు కాని-ఒక విధంగా బ్రహ్మనాయుని చాపకూటి సిద్ధాంతాలకు మీరు స్వయంగా డబ్బు యిచ్చి-దూరంగా పంపి అవిసీతిని మరింత బాహాటంగా విస్త రింపచేసిన వారయ్యారేమోననిపిస్తుంది" అన్నాడు.

న్యాయం సహనంగల నలగామరాజు తల పరికించి "నీవన్నది నిజమే తమ్ముడూ! నా మంచితనం మంచికన్న చెడునే మిక్కుటంగా కలిగించిందనక తప్పదు. బ్రహ్మనాయుడిక్కడ చేయుచున్న అనాచారమక్కడ లేకుండా చేసినట్లు యితే అలరాజాదులు తిరిగి మన చెంతకు వచ్చి యుండెడివారు. బాలచంద్రుడయిన

మాంచాలతో క్షాపురం చేసుకొని యుండెడివాడు. అటరాజు, బాలచంద్రులు సంస్కారం పొందలేకపోగా మరింత మోహితులై పోవుచున్నందున మహామంత్రుల వారి వ్యాపారం మారలేదని తెలుస్తూంది. దానిని సరిదిద్దడం మన కర్తవ్యమంటాను. దీన్ని నాగమ్మ గారేమంటారు?" అన్నాడు.

నాగమ్మ లేచి "ప్రభూ! మాచర్ల మలిదేవాదుల కెంత స్వతంత్ర్య రాజ్యమైనా దాని నిర్మాణమునకు ద్రవ్యమిచ్చిన మీకు అందలి మంచిచెడ్డలు చూచే అధికారం పోలేదు. ఒకప్పుడు లేకపోవచ్చునుగాక ప్రక్క రాజ్యంబు నందరాజకము ప్రబలి నపుడు సాటిరాజు లెవరై ననను పాలకుల నెదిరించి ప్రజలకు న్యాయము చేకూర్చు టయు క్షత్రియ ధర్మములందు ప్రధానమై యున్నది. అదియును గాక- మనకు సంబంధించిన వ్యక్తులక్కడున్నారు. వారిని రప్పించుకొనుట మన కర్తవ్యము. మాచర్లలో జరుగుతూన్న యవినీతి మాన్పవలయునంటే మలిదేవాదుల చేతిలోని మాచర్లను ముందుగా మనం మనచేత పట్టుకోవాలి."

అదెలా సాధ్యం ?

బ్రహ్మనాయునికి కోడిపందెములన్న మితిలేని ప్రేమ. రేపు రానున్న సంక్రాంతి పెండుగ సందర్భముగా కోడిపందెముల కాహ్వానించి- పందెమున నోడించి- మాచర్ల రాజ్యమును మనం చేజిక్కించు కొనుటయే చేయదగినదని నా అభిప్రాయం.

నరసింగరాజందుకొని "నాగమ్మ యోచన యుక్తియుక్తముగనే యున్నది. బ్రహ్మనాయునికి కోడిపందెముల భ్రాంతి యన్నమాట నిజమే అయినకందు ప్రావీణ్యము కూడ కలదు. పందెమున మనమే గెల్చి వారినోడించగలమను నమ్మక మేమున్నది ! దానివలన ఫలితమేమున్న"దన్నాడు.

నాగమ్మ తిరిగి "అదే రాజ్యాంగ తంత్రం. మన పందెపు పుంజుకు కొలతలు తీసి యినుపకవచం చేయించాలి దానికి సరిపడిన రంగులు వేయించాలి. నేర్పరులయిన పనివారలను నియమించి పందెం సమయంలో యితరుల కంటబడకుండా పుంజుకా కవచం తొడిగి పని పూర్తికాగానే తీయించే యేర్పాటులు చేయించాలి. మహారాజా! ఇందులో స్వార్థమెంతమాత్రమూలేదు. కుటుంబ కలహం ప్రబలం కాకుండ అశాంతి కార్యక్రమములు తలెత్తకుండ, మాచర్ల రాజ్యాపాలనాధికారం మన చేతికి రావడం అవినీతిని హరించడమే ప్రధానములని మనవి చేస్తున్నాను.

అంతేకాదు కోడిపందెంలో మన మోడించేది మాచర్ల పాలకులయిన మలిదేవాదులను మాత్రమే. రాజ్యమోడిపోయిన రాజులు వలన బోక తప్పదు. మన కొమ్మరాజుల రాజులకు వలసపోవలసిన యగత్యముండదు. మలిదేవాదులు తిరిగి కచ్చువరకై నను మీరీ గురజాల యందుండునని మనము కొమ్మరాజును, అలరాజు నిందుండ నియమింపవచ్చును. ఆ సమయంబున మన పేరమ్మ అలరాజుల దాంపత్యము చక్కబడిన మహానందము కాగల"దని వచింప నలగామరాజు సంతసించాడు.

సంక్రాంతి వెళ్ళిన కనుమపండుగనాడు మేము జరుపబోవుచున్న కోడిపందెములకు రావలసినదంటూ గురజాలనుండి మాచర్లకు వార్తపోయింది. ప్రభు నాయుడందులో ఆరితేరిన చేయి కనుక గురజాలవారిని తేలికగా మోడించవచ్చును. నాగమ్మ మీద పగదీర్చుకొనవచ్చుననుకొని కోడిపందానికి అంగీకారం తెలిపాడు.

మాచర్లలో ఓడిపోయిన మలిదేవాదులు

మహాసంక్రాంతి వెళ్ళిన మరునాడు కనుమ పండుగ సందర్భముగ కోడి పందెములు వినోద కార్యక్రమములుగ నియమింపబడినై. తాటాకు చందిళ్ళు

వేయబడినై. మంచినీటి చలివేంద్ర లమరింపబడినై, చిన్న చిన్న చిరుతినుబండా రాల దుకాణాలు గూడ నెలకొల్పబడినాయి. ఇక కళ్లు సారా కొట్లమాట చెప్ప నవసముండదు. గురజాల ప్రభువులు మాచర్ల ప్రభువులను కోడిపందెపు క్రీడా రంగం దగ్గరకు చేరుకున్నారు.

బ్రహ్మనాయుని పరివారమంతా ఓటమి నెరుగని పందెగాండ్రమన్న హుందాతనంతో మత్తుపదార్థాలు సేవించి మైకంలో మునిగున్నారు. నాగమ్మ తన పరివారాన్ని చేరబిలిచి "అతి మెలకువతో పందెం గెలిపించడం మీ వంతు. పారి తోషికాల నిప్పించడం నా వంతు. పని ముగిసిన తరువాత మీమీ విలాసాల మీరను భవించవచ్చును. పనికి ముందు పరాకు పనికిరా"దని హెచ్చరించింది. నమ్మకంగల సుబ్బన్న సూచన లనుసరించి పందెపు పుంజుకు యినుప కవచం తొడిగి సమయం వచ్చినదాకా దానిని చాటున దాచుంచాడు.

నిర్ణీతకాలంలో పందెం ప్రారంభమయింది.

తొలి పందెంలో గురజాలవారు దించిన బెరవజాతి పుంజును మాచర్లవారి కాకి డేగ జాతిపుంజు ఓడించింది. మలిపందెంలో గూడా గురజాలవారి పందెపు పుంజులను మాచర్లవారి వింజాచెరసజాని పుంజు చంపింది. ఇక మూడవ పందెంలో ఓడిపోయినవారు వారి రాజ్యాన్ని గెలిచిన వారికిచ్చి ఏడేండ్లు వలసపోయేనిర్ణయం చేసుకున్నారు. గురజాల వారిపుడు సుబ్బన్న దాచియుంచిన పుంజును నేలమీద విడిచిపెట్టారు. మాచర్లవారు మాంచి పౌరుషంగల పుంజును విడిచారు. నిజానికి కవచం లేకపోతే నాగమ్మ పుంజెపుడో పడిపోవలసిందే. ఆ కారణంచేత నాయుడు గారి పుంజుకు బాగా శ్రమ కలిగింది. అది చూచిన మలిదేవాదులు "మన పుంజు పందెం విలువ తెలుసుకొని పోరాడుతుంది" అని అనుకొని సవ్వుకున్నారు. కాని నవ్వెంతసేపో నిలువక మరుక్షణంలోనే వారి పుంజు దెబ్బతిని పడిపోయింది. వారంతా పడిపోయిన పుంజును పరామర్శించే సమయంలో కనుమరుగున కోడి మీదనున్న కవచమూడదీశాడు.

పందెంలో మాచర్ల రాజులు పరాజయం పొందారు. గురిజాల పరివారంవారు మాచర్ల దొరలకు మీసాలు లేవు- వారి పుంజులకు రోసాలు లే"వని పాటలు పాడారు. మాచర్ల నగరం నలగామని వశమయింది. నాగమ్మ 'నరసింగరాజు' నల గామరాజు తెన్నివిధాల చెప్పినా వినకుండా కొమ్మరాజు అలరాజులు మలిదేవాదు లతో పాటు పలసపోవడానికే బ్రహ్మనాయుననుసరించారు. మాచర్లదొరలంతా ఏలే శ్వరం చెంత కృష్ణానదిని దాటి మండాది పట్నం చేరుకున్నారు. మండాదికి సమీ పంలో ఒక కొండ-ఆ కొండనుండి గ్రామం పక్కగా ప్రవహించే సెలయేరు. ఆ చక్కదనాల సెలయేరు దరులందలి రమణీయ ప్రకృతి జనాకర్షణీయమైంది.

బ్రహ్మనాయుడు తన సమూహమునంతా వెంటబెట్టుకుని దొమ్మర్ల రేవు దగ్గర కృష్ణను దాటి శ్రీశైలంపోయి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకములతో సేవలు చేయించిన తరువాత నా సీమను పాలించుచున్న మూకరాజును దర్శించారు మూకరాజు వారందరను అతిథిమార్యాదలతో గౌరవిం చాడు. ఆ సమయంలో రాజును బ్రహ్మనాయుడు తన వీరఖడ్గం కుదువపెట్టుకుని కోటి బంగారు నాణెముల రుణమిమ్మని యడిగాడు. కాని-మూకరాజందుల కంగీ కరింపక పాలనలోని మార్కాపురం, త్రిపురాంతకం మొదలైన యిరువదిమూడు గ్రామాలను గుత్తకిచ్చాడు. మలిదేవులా సదవకాశాన్ని ఉపయోగించుకొని వీర మేడపిలో కాలం గడుపుతూండగా గడవు యేడుసంవత్సరాలేగాక యింకా ఆరు మాసాలు దాటిపోయినై.

కోడిపందెముల నాటి నిర్ణయం ప్రకారంగా మాచర్లను తిరిగి మాకీయ వల సిందిగా అలరాజును రాయబారమంప నియమించాడు బ్రహ్మన్న. కొమ్మరాజున కామాట వినడంతోనే గుండె గుభేలుమన్నది. కొడుకును గురిజాల పంపడానికి శంకించిన కొమ్మరాజుతో నాయుడుగారు "బావగారూ! భయపడకండి. నేను దూరమాలోచించే మన రాంమల్లును రాయబారిగా నెన్నుకున్నాను. ఇన్నినాళ్ళ

తరువాత యింటి యల్లుని రాక విని నలగాముడాసందించగలడు. కుమార్తె మొగం చూచయినా గురిజాల ప్రభువులు సంధికామోదించెదరను తలంపున నేనీ పనికి పూనుకున్నాను. నీ పనుమానించినట్లు నాగమ్మ మొదలైన వారివలన అలరాజున కపాయము సంభవించునను భీతి నాకులేదు. ఒకవేళ అలాగా జరిగితే నీ కుమారుని ప్రాణాలకు బదులు నా కుమారుని ప్రాణాలిస్తాను. బావా! నీ కొక్కడే కొడుకు నాకూ ఒక్కడే కొడుకు. కడుపుతీపి నాకు తెలియనిదా!" అన్నాడు.

కొమ్మరాజింక కాదనలేకపోయాడు.

అలరాజు రాయబారిగా గురిజాలకు ప్రయాణమయ్యాడు.

తిరిగి రాలేకపోయిన అలరాజు

అలరాజు రాయబారిగా వచ్చుచున్న వార్త విని నలగామరాజు ఆనందంతో బాటు ఆందోళన పొలయ్యాడు. నరసింగరాజు, నాగమ్మలు సంధి కుదరనీయని మాట సత్యం. అయినా అలరాజు క్షేమంగా తిరిగి వీరమేడపికి చేరకపోతే మనం నిందాస్పదులం కాగలమనే భయంతో తగిన జాగ్రత్తలు తీసుకొనడం మంచిదే. అలరాజుకు నచ్చజెప్పి వానిని మా పక్షం త్రిప్పడానికి గూడా మావారు ప్రయత్నించుచున్నారు నా యేకైక కుమారి రత్నాలపేరమ్మ యదృష్టమెట్లున్నదో" అని అనుకుంటున్నాడు.

అలరాజు క్షేమంగా గురిజాల చేరుకున్నాడు.

రాజమర్యాదలు జరిగినై.

రాజసభ కేతెంచిన అలరాజు నే నిపుడు రాజకుటుంబ తగాదాలలో రాయబారిగా మాటాడవచ్చినాడనేగాని రాజబంధువుగా మర్యాదలను పొందడానికి రాలేదు అది మీకును తెలియనిదికాదు. కోడిపందెములనాటి నిశ్చయంతో ప్రతాళం

మాచర్లరాజులు ఏడు సంపత్సరాల వలస పూర్తి చేయడం జరిగిపోయింది. ఇక వారి మాచర్ల నగరం వొదిలేయవలసినదిగా నాచే రాయబారమంపించారు. ఎదుటి వారి సందేశం మీకు వినిపించాను- తరువాత మీరిచ్చిన సమాధానం వారి కందీయడం నా ధర్మ"మంటూ కూర్చున్నాడు.

సలగామరాజు నాగమ్మవంక చూచాడు.

నాగమ్మ నవ్వింది "రాజకుమారా! రాయబారిగా నీవు చెప్పిన మాటలు నాకు నచ్చినై. ఆనాటి నిర్ణయమేమిటో నీవుగాని వారుగాని అర్థం చేసుకొనలేదని నేనిపుడనుకుంటున్నాను. "మాచర్ల మీకియాలి-మీరేడేండ్లు వలసపోవాలి" అని కదా! అంతే ఏడేండ్ల తరువాత తిరిగి మీ రాజ్యం మీకిస్తామని మేమానాడన లేదు. యీనా డిచ్చునదిలేదు. ఇదే మా సమాధాన"మన్నది.

నాగమ్మ చిరునవ్వు నవ్వింది. "అలరాజా! చెపుతున్నాను వినుమాచర్ల మాకు స్వాధీనమయింది. పాతకాలమునాటి పాలకులైన మలిదేవాదులు "మేమిపుడు పాలకులము కాము-పౌరులముగానే మాచర్ల యందు నివసించుచున్నా" మన వచ్చును. ముందొకనాటికి మాకిందు కొన్ని యధికారములున్నవనియు నెదిరింప వచ్చును. అట్టి యవకాశము లేమియు లేకుండుటకుగాను మలిదేవాదులకు సంబంధించిన వారెవరును మాచర్ల పౌరులేతరుల యందైన నుండరాదని - వారి కందధికారము లేదని రుజువు చేయుటకై యేడేండ్లపైనైన మా ప్రాంతములందుండరాదని వలస చేయుమంటిమేకాని తరువాత మాచర్లను తిరిగి మీకిచ్చెదమనికాదు. ఓడిపోయినవారు నగర మిడిపోవుట బాగున్నది. ఏడేండ్లు వలస చేశారు బాగున్నది- మాచర్ల మేమీయ నవసరములేదని వారికి చెప్పు"మన్నది.

ఈ సమాధానమునే నీవు వారికందించి నీ ధర్మం నెరవేర్చుకొమ్మన్నాడు నలగామరాజు-నాగమ్మ తీర్మానాన్ని సవరించకుండ—

"సరే- నేను వచ్చిన పనియైన" దంటూ లేచాడు అలరాజు.

నరసింగరాజు వెంటనే "రాజకుమారా! ఇంతవరకూ జరిగింది రాయబారమును గురించి ప్రసంగం అయిపోయింది. ఇక నీవు మా యింటి యల్లుడవుగా నేను చెప్పదలంచిన మాటలున్నవి గూర్చుండుము. ఈ రాజ్యము మీ మామగారి తల్లియైన మైలమదేవి పుట్టింటి వారిదగుటచే స్త్రీ ధనమై యున్నది. అనుగురాజ భూపాలుని పెద్దకుమారుడుగ కూడా గురిజాల సింహాసనం నలగామ భూపాలుని పాలితం బగుట ధర్మమైయున్నది. ఇప్పుడీ నరేంద్రులకు మగసంతానం లేనందున రత్నాలపేరమ్మ దీనికి వారసురాలు. ఆమె భర్తవగు నీ రాజ్యమునకు కాబోవు సర్వాధికారివి.

పినకుమారునిగా చెప్పుచున్న నా మాట విని నీవు నీ తండ్రితోగూడి గురిజాలకు వచ్చి నీ క్రొత్తకాపురమును సరిదిద్దుకొని రాజ్యపాలకుడవు కమ్మని నా కోరిక" అన్నాడు.

నిలుచున్న అలరాజు కూర్చొనకుండగనే "మాపుగడిచినగద రేపటిమాట ? మీ సమాధాన మాలకించిన మాచర్ల ప్రభువులు కత్తిదూసి కదనరంగం మీద దుముకకున్న నున్న గదా గురిజాలరాజ్య సింహాసనానికి కుదురుబాటు లభించునది ? ముందు మహాప్రళయం ముంచుకొని వచ్చుచుండ ముచ్చటలు చెప్పుకుని మురిసిపోయే మందమతిని కాను, సర్వ సేనా నాయకుల వారి సందేశానికి సమాధాన మీయడమయింది. ఇకపోతున్నా" అని బయలుదేరిన అలరాజు నిరపాయకరంగా గురిజాల దాటాడే కాని చర్లగుడిపాడు యొద్ద వానిని నెవరో పొంచియుండి చంపివేశారు.

అలరాజును చంపించినవాడు నరసింగరాజా ? బ్రహ్మనాయుడా ?

త్రిపురాంతకము చేరిన మలిదేవాదులు

అలరాజు మరణవార్త విని నలగామరాజు పుట్టెడు దుఃఖంలో మునిగి పోయాడు విధులు తప్పవుకావున అల్లుని భౌతికదేహం తెప్పించి దహన క్రియలు చేయించే సమయంలో తన ముద్దుల కుమార్తె నాటి సాంప్రదాయము ననుసరించి సహగమనం చేసింది. నిండుప్రాణాల పేరమ్మ మగనిశరీరంతో బడి మాడిపోయిన దృశ్యం చూచిన వారందరి హృదయాలు ఘోషించిపోయినపుడు కన్నతండ్రి హృదయమెంతగా అల్లాడిపోయిందో మూహింపలేము.

రాచమల్లు చనిపోయిన వార్త వీరమేడపికి మూడురోజుల కందింది. కొడుకును కోల్పోయి గోడుగోడున వాపోవు కొమ్మరాజుతో బ్రహ్మన్న బావగారూ ! నేనను కున్న దొకటి—అయిన దింకొకటి. ఏకైకపుత్రిక మీది యనురాగమున సంధి కంగీ కరించు ననుకొంటినే కాని, పూర్వ బాంధవ్యమును పూర్తిగ తెంపి వేయుటకా నాగమ్మ యింత సాహసాని కొడిగట్టుతుందనిగాన— రక్తసంబంధంగల నరసింహ రావు యింత పనిచేస్తాడనిగాని నేనూహించలేక పోయాను. నీ కుమారునిప్పుడు పంపరానిచోటకు పంపించి పగవారిచేతుల కప్పగించి ప్రాణాలు తీయించిన పాప కర్ముడను నేనయ్యాను. బావా ! నీ కుమారుని చంపించిన ఆ నరసింగుని తల నరికించి నీకు చూపనిదే నేనింక బ్రహ్మనాయుడను గాను" అని శపథం చేశాడు.

బాలచంద్రుడు దుందుడుకు వాడైనా తండ్రి కపటం తెలియని యమాయకుడు. బ్రహ్మన్నగారి నాటకం ఖూటకమని యనుకొనలేనందున చివాలున లేచి మామా ! అలరాజు నంత మొందించిన నాగమ్మ ప్రాణంబులు నాగులేటి గలిపి - నరసింగ రాజు తలగొట్టి నీకు చూపకున్న నేను బ్రహ్మనాయుని పుత్రుడనే గా"నని ప్రతిన చేశాడు

గురిజాల రాజసభలో అలరాజు మరణాన్ని గుఱించిన వివారణ ప్రారంభమైంది ! నలగాముడా యాలోచన కొనసాగనీయలేదు. "నరసింగరాయ నాగమ్మలారా ! జరిగిన దేదియో నా కర్థమగుతూనే యున్నది. బ్రహ్మనాయుడు సామాన్యుడు కాడు. అలరాజును మాచర్ల మహామంత్రిగారే చంపించినారని నెఱుంగుదును. రాయబారమునకు వచ్చిపోవునపుడు చంపించుటలో వాని యోచనవేరు. అలరాజు నంతమొందించిన హంతకులు మీరిద్దఱేనని భావింతుననియు గాన "నాకింత ద్రోహ మొనరించిన మీరు నాకేల నని నాగమ్మను మంత్రి స్థానమునుండి - నరసింగరాజును సైన్యాధిపతి స్థానము నుండి తొలగింతుననియు, తరువాత నేనా బ్రహ్మనాయుని మంత్రిత్వము - కన్నమును సైన్యాధిపత్యముల పహించుడని ప్రార్థింతు ననియు బ్రహ్మన్న పన్నిన పన్నాగము.

అదిగాక - పూర్వ మొకానొక సమయంబున యీ బ్రహ్మనాయుని అన్న బాపరాయునికి మన అలరాజుకును వాగ్వివాదం జరిగి చివరకు ఒకరి నొకరు చంపుకొనబోవు వరకును వచ్చినది ! అలరాజు రాజబంధువైనందున ముందు యోచనగల బ్రహ్మన్న నాటికా వైరమును యుక్తియుక్తంబుగ శాంతి పరచాడు. అప్పటి నాయుడు అలరాజుమీద పగసాధింపనెంచిన రహస్యము నాకు తెలియును. కాని చెప్పినను తెలిసికొనలేని ఆ తంత్రికొడుకులు కసాయివానినే నమ్మి మన మంచి తనాన్ని గమనింప లేకపోయారు. అలరాజును చంపే యవకాశ మిపుడా బ్రహ్మనాయునికి దొరికింది.

ఇంత కష్టాలోచన కడుపున పెట్టుకుని అలరాజుని రాయబారికిగా పంపించినాడా పాతమంత్రి దీనితో వాని సంకల్పం నెరవేరింది-నింద యింకొకరిమీద పడింది. మలిదేవాదులకు సింహాసనాధికారం కలుగుతుంది. అలరాజును చంపిన వారమను నెపంతో మనమీద యుద్ధం ప్రకటించడాని కిదియొక పన్నుగడ.

నా మంచితనమున ముందేనాటికైనా నా కుమార్తె జీవితము బాగుపడునను కొంటిని కాని చివరకు నా యింటి దీప మారిపోవునని నేను తలంచలేదు. ఇంత జరిగిన తరువాత యుద్ధానికయినా వెనుకాడుటెందులకు! కావలసిన పనులు కానీయండి" అన్నాడు బిగువుగల తెగువతనంతో.

నరసింగరాజు, నాగమ్మ లొక్కసారి గట్టిగా గాలిపీల్చి ఒదిలి లేచారు "అమ్మయ్యా!" అంటూ తేలికపడిన గుండెలను చేతితో సవరించుకుంటూ.

వీరమేడపి రాజులు యుద్ధానికి సిద్ధమై కత్తులు దూశారు. భండన భూమికి బయలుదేరుతూ వీరమేడపికి మలిదేవులలో చిన్నవాడయిన బాలమలిదేవుని రాజును చేశారు. బాలమంత్రునికి మహామంత్రి స్థానమిచ్చారు. మలుని మంత్రులలోనివాడైన అనపోతునకు కరణీకపు పదవి నిచ్చారు. మాడచి యనుదానుకి అంతఃపుర పాల నాధికార మొప్పగించిన తరు[illegible] బ్రహ్మనాయుని యాజమాన్యంలో మలిదేవును కతిపయసేనా సమేతంబు[illegible] ఒక్కరోజు చూచుకొని కదనానికి బయలుదేరిపోయి త్రిపురాంతకం చేరుకున్నారు

కారెమపూడి చేరిన మలిదేవాదులు

కయ్యానికి కాలుదువ్విన నాయుడుగారు తన మందీమార్బలంతో త్రిపురాంతకం పోయి విజయం కలిగించండి అని వేల్పులను వేడుకున్నాడు. అంతకు పూర్వం శివపురం నుండి తెచ్చి నిల్పిన శక్తుల నారాధించాడు. స్థంబం రూపంలో నున్న ఒక దేవతామూర్తిని పూజించాడు. రకరకాల పిండివంటలు, కూరలు, పాయసాలు, అన్నం కుంభం పోయించి, మైసాక్షి సాంబ్రాణి - మంచి గుగ్గిలం పొగలు వేయించి - మేకపోతుళను కోసి బలిదానమిచ్చాడు. అన్నీ అయ్యాక ఆ స్థంభాన్ని పెకలించి బండిమీద గట్టించాడు. ఆ బండివెంట మరికొన్ని బండ్లు బయలుదేరినై.

నాయకులంతట "అందెల ఐసవన్న! అదినాథ! నంచుల పిండిగంట! నాగ వాస! గోవులపిటగాడు! గోగుబయ్యన్న! పరపెరుమాళ్ళు! అంబుదిశయన! విరుదు గరుత్మంత! భీమగజ! గోవర్ధనాచల గోపాలదేవ! కరినందిబసవన్న కంబరద! నెల బాలచంద్ర! నీలవర్ణ! జయకంతనాథ! వైకుంతవాస! వాసుదేవ! పుట్ట భూపతి! పుంజెల్లు పెద్ద! ఇప్పగిరీశ! గోగుశ్వేరవమూర్తి! గోవిందరాజ! చెంచుల ఓబయ్య! చెన్నమల్లయ్య! కంచియేకాంబర! కాళిదాస! కామా! సోమా! రామా! భీమా!" అని పెట్టుకున్న ముద్దుపేరులుగల మదపుటెద్దులను పరుసగా పిలిచి బండ్లకుగట్టి అదిలించారు.

గణగణ గజ్జల మ్రోతలతో! ధణధణ గిట్టల చప్పుడలతో త్రిపురాంతకం నుండి ముందుకుసాగిన మలిదేవుని సేనలు వినుకొండ తాలూకాకు చెందిన మర్రి వేముల! గుమ్మనంపాడు! గరికేపాడు గ్రామములమీదుగా పల్లెకు చేరినై. అక్కడ బ్రహ్మనాయుడు, మలిదేవుడు, రాజకుటుంబమువారు, యోధుల మనుకున్న వారంతా వీరకంకణాలు ధరించారు. వీరకంకణాలు ధరించిన చోటుకనుక బహుశ ఆ పల్లెకు కంకణాలపల్లె యను పేరు వచ్చినదేమో తరువాత వీరులంతా పైడిపాడు దాటి సంబచీకటిపాడు వేళకు మేళ్ళవాగుచేరి మజిలీ చేశారు.

చీకటి పడుచుండగ బ్రహ్మనాయుడు కన్నముని పిలిచి "దానూ! నీ వెపుడో కాకెమపూడికిపోయి నాగులేటి యొడ్డున స్మశానము మనకెంతపరకు అనుకూలముగ నున్నదో చూచి రమ్మనాడు. కన్నమదాసు కాపనకుండ ఆ చీకటిలోనే మేళ్ళ చెరువున కారుమైళ్ళ దూరాననున్న కాకెమపూడికి ఒంటరిగ పోయాడు. అసలే చీకటిలో కలిసిపోయే నల్ల శరీరం మెలికలు తిరిగిన కండలు—గంభీరమైన ముఖం-కావిపంచె-తలపాగ, కోరమీసం-ఒరలో కరవాలం-చేతిలోపట్టు కర్ర-కాలికి అందె గలవాని రూపంచూచి స్మశానంలోకి భూతాలు సమీపించినై కాని కన్నము డొక్కసారి గట్టిగా హుంకరించి కత్తి ఝళిపించినంతనే యెటు భూతాలటు పారిపోయినై..

భంగపడిన భట్టు రాయబారము

తెలతెలవారు సరికి తిరిగి మళ్ళీ చెఱువు చేరిన బ్రహ్మనాయుడు బ్రాహ్మణులకు దానాలనిచ్చి సైన్యంతో కాకెపూడి వచ్చి చేరాడు. ప్రముఖులైన వారందరూ గంగాధర మడుగున స్నానాలుచేసి శివలింగాలను స్థాపనలు గావించి పూజించారు. మనకీనాడు గంగాధర మడుగు తీరాన కనపడే లింగాలానాటివేనని జనవాడుక. బ్రహ్మనాయుడు గారంటట భట్టును రాయబారిగా గురజాలకు పంపించాడు.

నలగాముడు సభదీరియుండగా భట్టు తన రాయబారం సారాంశమంటూ "మీరు మీ నరసింగరాజును మాచు భట్టిఇచ్చి యీ యుద్ధం జరుగకుండా సంధి చేయడం మంచి"నంటూ నివేదించాడు. ఆ మాటలు వింటూనే నలగాముని ఒడలు మండిపోయింది. "మగసిరి గల మానవుడెపుడూ తన తమ్ముని పట్టి యీయడని తెలియదా! ఆ పని చేయమనిపిస్తే వారు చేయుదురా! మాటాడుటకు మంచి మర్యాద లవసరములు లేవా?" అన్నాడు గంభీరంగా.

నాగమ్మ అందుకుని "మహారాజా! వంశనాశనానికి దుర్జాతివాడైన జాతి మొకడుండెయిండా నిప్పెంచు" కన్నది వీరవిద్యాదేవి కుమారులను గురించి యెత్తి పొడుస్తూ.

భట్టుకామాట శూలం పోటులా నాటింది. "నలగామా! నీ యల్లుని చంపి నీ కూతురు సహగమనానికి కారకుడైన నలగాముని తలమీద తెక్కించుకుని భగవంతుని వంటి బ్రహ్మనాయుని నిరాకరించడం మంచిది కా"దన్నాడు.

నలగాముడు రోషంగా "ఇలరాజు చావుకు కారకులెవరో తెలియని మంద మతిని కాను భట్టూ! ఇక నీ మాటలు చాలించు, సైన్య సమేతంగా సమరభూమికి వచ్చాక సంధి రాయబారమంపిన బ్రహ్మన్నగారి సదభిప్రాయ మర్థమగుచునే

భంగపడిన భట్టు రాయబారము

తెలతెలవారు సరికి తిరిగి ఓర్పు చెఱువు చేరిన బ్రహ్మనాయుడు బ్రాహ్మణులకు దానాలనిచ్చి సైన్యంతో కాశెపూడి పచ్చి చేరాడు. ప్రముఖులైన వారందరూ గంగాధర మడుగున స్నానాలుచేసి శివలింగాలను స్థాపనలు గావించి పూజించారు. మనకినాడు గంగాధర మడుగు తీరాన కనపడే లింగా లానాటివేనని జనవాడుక. బ్రహ్మనాయుడు గారంతట భట్టును రాయబారిగా గురజాలకు పంపించాడు.

నలగాముడు సభదీరియుండగా భట్టు తన రాయబారం సారాంశమంటూ "మీరు మీ నరసింగరాజును మాకు బట్టిచ్చి యీ యుద్ధం జరుగకుండా సంధి చేయడం మంచి"దంటూ విన్నవించాడు. ఆ మాటలు వింటూనే నలగాముని ఒడలు మండిపోయింది. "మగసిరి గల మానవుడెపడూ తన తమ్ముని పట్టి యీయడని తెలియదా! ఆ పని చేయమనిపిస్తే వారు చేయుదురా! మాటాడుటకు మంచి మర్యాద లవసరములు లేవా?" అన్నాడు గంభీరంగా.

నాగమ్మ అందుకుని "మహారాజా! వంశనాశనానికి దుర్జాతివాడైన జాతి యొకడుంటె యింకా నిప్పెందు" కన్నది వీరవిద్యాదేవి కుమారులను గురించి యెత్తి పొడుస్తూ.

భట్టుకామాట శూలం పోటులా నాటింది. "నలగామా! నీ యల్లుని చంపి నీ కూతురు సహగమనానికి కారకుడైన నలగాముని తలమీద తెక్కించుకుని భగవంతుని వంటి బ్రహ్మనాయుని నిరాకరించడం మంచిది కా"దన్నాడు.

నలగాముడు రోషంగా "అలరాజు చావుకు కారకులెవరో తెలియని మంద మతిని కాను. భట్టూ! ఇక నీ మాటలు చాలించు, సైన్య సమేతంగా సమరభూమికి వచ్చాక సంధి రాయబారమంపిన బ్రహ్మన్నగారి సదభిప్రాయ మర్థమగుచునే

యున్నది. నీతి నిజాయితీకల రాజు లెపరేనియు వివాదాలు సంభవించినపుడు ముందుగా రాయబారమంపి, సంధి కుదరనపుడు యుద్ధమునకు వచ్చుచుంటుమని చెప్పిన తరువాత కదనభూమియందు ప్రవేశించెదరుకాని-ముందుగా వారన్నియు సవరించుకొని వచ్చి యుద్ధరంగమున కూర్చున్న తరువాత ప్రయత్నమున లేని వారిని పోరాడరమ్మనట్టి పనులు బుద్ధిమంతులు చేయునవి కావు "మేము సమర సన్నాహమున లేము-సమరమాడ రాజాల" మంటిమేని మమ్మవమాన పరచవలయు నని మా బలహీనము నెరింగి మాపై దాడి చేయవలయుననిగదా?" అని నిశితంగా విమర్శించాడు.

నలగాముని మాటలకెదురుగా చెప్పలేని భట్టు "రాజా! బ్రహ్మనాయుని బల మెట్టిదియొ నీ వెఱుగనిదికాదు. అయనకు దైవసహాయమున్నది. ఇంత గనుకనే యుద్ధమందు నపజయము నొందని నాయుని యెదిరించిన సింహములట్లు గర్జనలు చేయుచున్నారు. నీ కధిక సైన్యమున్నదని గర్వించు చుంటివి కాని సింహము ముందు మేకలమంద యెంతయిననేమి చేయగలదు! నీవి సంధి కొప్పు కొనకున్న వారు నిన్ను నీ పరివారమును నీ గురజాల రాజ్యమునుగూడ సర్వ నాశనము గావింపక విడువ" రనగ నలగాముడు నాగమ్మవంక చూచి "రాజసభా మర్యాదలు గాని-రాయబారి బాధ్యతలుగాని తెలియని వీనికి బుద్ధి చెప్పి వెడలనంపింపు" మన్నాడు.

మహాకోపంతో నాగమ్మ హుంకరించుచూ "భట్టూ! ఇక నొక్కమాటేనియు తక్కువ యెక్కువ లాడితివేని నిన్నేనుగు కాళ్ళక్రింద త్రొక్కింపక విడవను. ముందు నీవిచటినుండి లేచి వెళ్ళెదవా-నేను మెడబెట్టి నిన్ను బయటకు గెంటింపనా!" అనగా కిక్కురు మనకుండా భట్టులేచి నిలబడ్డాడు. నరసింగరాజు "ఔను! మొదట రాయబారము సేయవచ్చిన అంబరాజును మేమే చంపితిమని యింతకు ముందు నీవును అని యుంటివిగదా! సంధి చేయవచ్చు రాయబారులను చంపు

చున్న యీ గురజాల ప్రభువులయొద్దకా బ్రహ్మన్న నీవును మా చేతులలో చావ వలయుననియే పంపినాడా! నీవు చావవలయుననియే వచ్చితివా!" అనగా సభలోని వారంతా గొల్లుమని నవ్వారు. ఒంచిన తల యెత్తకుండానే భట్టు దారిబట్టాడు.

కారెమపూడికి చేరిన నలగామాదులు

గురజాలలో రాజసభ జరిగింది. నలగామరాజు పరివారంవంక చూచి "మాచర్ల యోధులంతా అరువదేడ్డురె-కొలదిగ మూక సైన్యముండవచ్చును. వారి శిబిరములన్నియు చెట్లక్రిందకు చాలవు. మనకు రాజ పెద్దలనాటి ధనమున్నది. ధాన్యమున్నది. సంఘమున్నది, ఉండుగాక - చిన్నపామునయివను పెద్ద కర్రతో కొట్టవలయునని పెద్దలు చెప్పియున్నారు నాయుడు మహాకపటి, ఏదియో మాయో పాయము పన్నకయే యీ సాహస మొనరింపడు. అజాగ్రత్త కూడనిది. మనకు యుద్ధమున సాయమొనరింపగల రాజులందరకు తోడుసేయ రండని జాబులు వ్రాసి పిలిపించండి. సేనలను యుద్ధసన్నద్ధుల చేయం"డని తగిన కట్టుదిట్టములు చేశాడు.

నరసింగరాజు నాగమ్మలు వ్రాత పనివారల నియమించి ధరణికోటనేలు భీమదేవునకు-ఎడమాడెము నేలు నెరుకామునకు- చోళరాజు సూర్యకుమారునకు మానుగుండంరాజు- గోలంకిరాజు - ఘూర్జరదేశపురాజు, జొన్నాళ్ళరాజు, పొదిలె రాజు, ధాన్య కటకంరాజు, దేవాద్రిరాజు, చంద్రగిరిరాజు, బంగాళదేశపురాజు, పాండ్యరాజు, మళయాళరాజు, కర్ణాటకరాజు, నురగసేనుడు, కల్వరాయుడు, పెదబాహుపతి భీమసేనుడు, జయదేవుడు, జయసింగు వీరభళ్ళాడు మొదలయిన రాజులందరకు యుద్ధసహాయము చేయరండని ఉత్తరములు వ్రాయించారు.

నలగామభూపతి బ్రాహ్మణుల చేత సుముహూర్తం పెట్టించి సైనికుల ప్రోత్సహించుకొని తగిన సన్నాహంతో పట్టపుటేనుగు నెక్కి కారెమపూడి వస్తూండగ త్రోవలో బ్రాహ్మణులు దూబచెరువు దగ్గర ఆశీర్వదించారు. అటు తరువాత కొదమగుండ్ల దగ్గర గ్రామపౌరులు దర్శించి "రాజేంద్రా! అన్నదమ్ములలో కయ్యమెందుకు? సంధిగావించి శాంతి కలిగించండి. ప్రభువులకు ప్రజలకుగూడ క్షేమకర"మని మనవి చేశారు. గురజాల ప్రభువులకు వారికి తగిన సమాధానము చెప్పి ముందుకు సాగి కారెమపూడి యుద్ధభూమిని చేరుకున్నాడు.

పిలుపులందిన వీరభల్లాణరాజు పన్నెండు వేలమంది భట సమూహంతో వచ్చి నలగాముని సేనలలో చేరాడు. అటులనే వేయిమంది కాల్బలము; గజబల ముతో జొన్నాళ్ళభూపాలుడు వచ్చాడు. పదహారువేల కాల్బలము, ముప్పది వేల గజబలంతో మాళవాధీశ్వరుడు వచ్చాడు. తొమ్మిదివేల కాల్బలము, ఒక వేయి అశ్వదళంతో వరంగల్ నుండి కాకతీయ ప్రతాపరుద్ర చక్రవర్తి పరివారాన్ని పంపించాడు. పదివేల కాల్బలముతో ప్రాచిదేవుడు వచ్చాడు. నీలిరంగు జండాల నీతైన భటుచయంతో బంగాళాధీశ్వరుడు వచ్చాడు. పదివేల గజబలం, యిరవైవేల కాల్బలంతో ఒరిస్సానేలు బలదేవ పురుషోత్తముడు వచ్చాడు—పది వేలాశ్వికదళం, లక్ష కాల్బలంతో కల్యాణమునేలు ఘూర్జర రాజులు వచ్చారు. వేయి మదపు టేనుగులు, వేయి బంట్లతో మహాదేవీదాసుడు వచ్చాడు. పది లక్షల కాల్బలంతో ద్రావిడ భూపతులు కేరళధరణీశులు వచ్చారు. రెండు వేలాశ్విక దళంతో పద్మ సేనుడు వచ్చాడు. ఎనభై యెనిమిదివేల సైనికులతో గుండమ దేవుడు గొబ్బూరి రాజు మొదలయినవారు లెక్కలేనంతమంది యోధానయోధులు వచ్చి కలిసిన నలగాముని సైన్యం యిసుకవేసిన రాలనట్లున్నది.

వచ్చిన వారందరికి గురజాల ప్రభువుల వారి రాజమర్యాదలందినై. ఎవరికి తగినట్లుగా వారికి పటుకుటీరాలమర్చబడినై. సైనికులకు భోజన వసతులు విశ్రాంతి

వసతులు చేయబడినాయి. ఏనుగులకు, గుర్రాలకు యితర జీవాలకు గూడ పాక లమరింపబడినాయి. ఆయుధాగారాలు నెలకొల్పబడినాయి. వైద్య కుటీరాలు వేయ బడినాయి. ఎటు చూచినా యెవరికి కొరతలు కనపడలేదు.

బాలచంద్రు డాడిన బొంగరాలాట

మాచర్ల నిర్మించిన క్రొత్తలలో చెన్నకేశవాలయమున మేళము సేయ వచ్చిన భోగము పడుచును చూచి భ్రమించిన బాలచంద్రుడు కన్నెరికంపెట్టి ఏడేండ్లు గడిచినాయి. వాని వయసిప్పటికి యిరువదైదేండ్లు నిండి యుండవచ్చును. ఐనను వానికింకా పడచుతనపు దుందుడుకు పనులు మానలేదు. మాచర్ల ప్రభు వులు యుద్ధానికి వెళుతూ బాలమలిదేవుని వీరమేడపికి రాజును చేసినపుడే తన్ను మంత్రిని చేసిన విషయం పూర్తిగా మరచినట్లున్నాడు బాలుడు. తమ పెద్దలంతా యుద్ధానికి పోయివుంటె వారి పరిస్థితులేమిటో? వారికాయుధాలే కావలయునో? ఆహార పదార్థాలే కావలయునో? అని అనుకొనకుండ మహామంత్రిగారి ముద్దుల కొడుకు మంత్రి పదవికి వచ్చాకగూడ బాధ్యతలను గుర్తించకపోవడం మరువరాని శోచనీయం.

బాలున కాటలరంది పెరిగింది. తోడి బాలురతో గుమ్మడికాయలాటలాడి, చెరకు పందెములు వేసిన తరువాత తల్లిదగ్గరకువచ్చి అడుకొన బంగారపు బొంగ రాలు కావాలన్నాడు. బతమ్మ మొదట నీవిపుడాటలకు పోవద్దని బుద్ధులు చెప్పింది. కాని అల్లరిపిల్లవాని పోరు పడలేక చివరకు చేయించి యిచ్చింది. బాలుడు ఊరి వెలుపల చావురావుల యొద్ద రావిచెట్టు క్రింద చెలికాండ్రతో బొంగరాలాడు తున్నాడు. ఆ వినోదం చూడడానికి గ్రామంలోని కొందరమ్మ లక్కలు గూడాపోయి గుంపులు గూడారు. ఊరి జనాన్ని చూచిన ఉత్సాహంతో బాలచంద్రుడు చేకొలది బొంగరాన్ని విసిరాడు. అది చట్రానికి తగిలి రింగుమని యెగిరివచ్చి నిలబడియున్న కోమటి అన్నమ్మ కాలికితగిలి బొటబొటమని నెత్తురు కారింది.

అన్నమ్మ నోరు చేసుకొని "ఓరి! మిడిమేలపు గుంటడా! నీ ప్రతాపం ఆడ దాని కాలిమీద చూపకపోతే యుద్ధంలో పగవానిమీద చూపరాదా! నీ యయ్యలంతా గురజాల రాజులమీద సమరమాడపోతే సిగ్గులేక నీవిక్కడ బొంగరాలాడుతున్నావురా! యుద్ధంలో నిన్ను యోధులు చుట్టుముట్టి నీ గుండెలలో యీటెలు గ్రుచ్చి పొడవ" అని యింకా యేమేమో యనబోవుచుండ బాలచంద్రుడు వినయంగా ఆమెను సమీపించి జరిగిన ప్రమాదాన్ని మన్నింపుమని వేడుకున్నాడు. వేలికి తగిలిన గాయం మాన్పుకునేందుల కామెకు కొంత సొమ్మిచ్చాడు.

అప్పటికైన ఆయన వీరమేడపికి క్రొత్తమంత్రియైన మాట జ్ఞాపకం రాక సరాసరి రాజభవనానికిపోయి ఐతమ్మతో "అమ్మా! మా నాన్నగారెక్కడకు పోయారు? ఎవరిమీద యుద్ధమాడబోయారు? ఏ దిక్కుగా పోయారు? చెప్పవమ్మా!" అన్నాడు.

బాలచంద్రుడు దుడుకైనవాడు. తండ్రిమాదిరే మంచిదయినా చెడ్డదయినా ముందు వెనుక ఆలోచించి సమయంచూచి సదుపాయంగా పనిసాధించే రకంకాదు. ఆవేశంవలన అపకాశమైనా పొందవచ్చును కనుక బాలుడు యుద్ధానికిపోతే తిరిగి రాడనే భయం తండ్రికున్నది. నాయుడుగారు స్వయంగా "మన చెన్నని మాత్రం యుద్ధానికి పంపవల"దని చెప్పియున్నాడు. అదే భయమైతమ్మ మనసులోనే నిలిచి పోయింది. కుమారుని చూపు కదనరంగం మీదికి పోకుండా చేయడానికే వాని ఆటకాయితనాన్ని మందలించడం లేదామె.

తల్లి దాచిన గుట్టునిప్పుడు కొడుకు చెప్పుమని పట్టుబట్టాడు. ఆమె గుండెలు దడదడలాడినై. నోటమాటరాలేదు. దేహమంతటా చమటలు గ్రమ్మినై. కొంచెం సేపటికి తేరుకొని "బాబూ! నలగామ భూపతితో సంధి కుదరనందున మలిదేవున కండగా మీ నాన్నగారు యుద్ధము చేయుటకెక్కడకు పోయిరో వివరములు నాకు తెలియ"వని చిన్న అబద్ధమాడి తప్పుకుంది.

పట్టుదలతో నున్న బాలచంద్రుడు "అమ్మా! కాకెముప్పూడి యొద్ద యుద్ధం జరుగుతూంది. నాన్నగారుకూడా అక్కడనే యున్నారు. తల మునిగిన యుద్ధ భారంలో తండ్రి సతమతమవుతూంటే యీడువచ్చిన కొడుకు మేడలలో చేడియలలో వేడుకలలో ప్రొద్దులు బుచ్చవచ్చునా! కన్నకుమారునికి కర్తవ్యముపదేశించి కరవాలముదూసి కదనభూమి కంపచగిన నీవంటి వీరమాత యిట్లు వెనుక ముందాడరాదు. నాకు సెలవిచ్చి పంపమ్మా!" అన్నాడు. ఐతమ్మ కుమారుని యుద్ధానికి పోవలదని చెప్పింది. ప్రమాదకరమయిందని భయపెట్టింది. ఆ మాటలు బాలుని తలకెక్కలేదు.

భండన మన్నను బాలుడు భయపడుటలేదు.

ఐతమ్మ తిరిగి "బాబూ! మాకు మొదట చాలాకాలం వరకు సంతానంలేదు. దానధర్మాలు చేశాం— తీర్థయాత్రలు చేశాం - సంతర్పణలు చేయించాం— బ్రాహ్మణ వటువుల కుపనయనాలు చేయించాం. చివరకు నేను ప్రతిదినం వేకువ జామున లేచి స్నానంచేసి గిలకబావిలో నీరునిపోసి దానిమ్మ పండ్లను నిత్యం బ్రాహ్మణులకు దానం చేస్తూన్న వ్రతం సంవత్సరం జరిపిన తరువాత నీవు కలిగావు. అది గాక ఒక్కడుగానొక్క కుమారుడవు. నిన్ను యుద్ధరంగానికి పంపి నేను బ్రతకలే" నన్నది.

అప్పటికిని కొడుకు తన మాట వినడంలేదు.

అత్తకోడండ్రు చేసిన కొత్తాలోచన

ఐతమ్మకాలోచన పాలుపోక శీలమ్మతో "అత్తగారూ! మీ కుమారుడు తన కుమారుని యుద్ధానికి పంపవలదని చెప్పారు. నా కుమారుడు నా మాట వినకుండా

సమరానికి సన్నాహమవుతున్నాడు. మనకిపు డుపాయమేమి" టని అడిగింది. శీలమ్మ యోచించి "కోడలా? బ్రహ్మ వ్రాసిన వ్రాతను మనం తప్పింపలేము. నీవెంత చేతులడ్డముంచినా నీ బిడ్డ నిలిచేలాగ లేడమ్మా! అటులని ప్రయత్నం చేయవలదని చెప్పడంకాదు. నా కిపుడు తోచిన యాలోచన చెప్పుచున్నాను. కోడలు మాంచాల కోమలాంగి చక్కదనాల చుక్క. చదువు సంస్కారాలున్నపిల్ల. భార్యమొగం చూచయినా బాలుడు యుద్ధం మానుకొనునేమో. నీవు కుమారునికి "భార్య దీవెనలంది ఖండనభూమికి పొమ్మని గండువారింటకి పంపించు" మని చెప్పింది.

బాలచంద్రునిలోని బలహీనమేమిటో అమ్మకు జేజమ్మకు గూడా అర్థమై నదే. అందమైన ఆడపిల్ల కంటబడితే అబ్బాయి ముందుపని మరచిపోతాడని అత్తా కోడండ్రు నిర్ణయం చేసుకున్నారు. బుతమ్మ కుమారునిచూచి "నాయనా! నీ ప్రయత్నం విరమించేదిలేదు. సమర రంగంలో శత్రువులను సంహరించి నీవు సలక్షణంగా తిరిగిరావాలని తల్లిగా నేను దీవిస్తున్నాను. భార్యగా నిన్ను దీవించి పంపవలసి యున్నది మాంచాల. గండువారమ్మాయి నిండుదీవెన లందుకొని యుద్ధానికి పొమ్మని చెప్పింది.

ఆ మాట వినడంతోనే బాలచంద్రుని మోము వెల వెల బారింది. కొంచెం సేపటికి తేరుకొని "అమ్మా! నాకు తల్లిదీవెనలైతే తిరుగులేదుకాని అలిదీవెనల కవకాశ మెక్కడిదమ్మా! మా పెండ్లయి యేడేండ్లు దాటినా నేనావిడ మొగం చూడలేదు. ఆవిడ నా మొహం చూచియెరుగదు. ఆలుమగలమయ్యామన్నమాటే కాని అందిందిలేదు. పొందిందిలేదు. అవసరం పడి అత్తవారింటికి పోతే అవమానం జరుగడనే నమ్మకము మాత్రమేమున్న" దన్నాడు బుతమ్మ గూడా ఆలోచించింది. కుమారుని తనయింట గూర్చుండబెట్టి అత్తగారిని అంతఃపుర పరిచారికలను వెంట బెట్టుకొని మేనాయెక్కి గండువారింటికి పోయింది.

గండు కన్నమనీని భార్య రేఖాంబ - ఆనాటి యింటూడబిడ్డ—యీనాటి ఈపరాలు వస్తున్నారన్నవార్త వినినంతనే తలవారిని వెంటబెట్టుకొనివచ్చి యింటిలోనికి తీసుకొనిపోయి కూర్చుండ నియమించి మర్యాదలు చేసింది. ఇన్నినాళ్ళ తరువాయినా వచ్చిన అత్తగారిని చూడడానికి మాంచాల అందలం దిగివచ్చి అడపరంజి బొమ్మలా నిలుచుంది. ఐతమ్మగారి రాక కారణం తెలుసుకొనిన రేఖాంబ "మీ కోడలే మీకు సమాధానమిస్తుంది. మీ రిద్దరూ గండువారింటి యాడపడుచులే - రేచర్ల వారింటి కోడండ్రే కనుక మీరు మాటాడుకొనండి" అంటూ మాంచాల వంక చూచి చిన్న నవ్వునవ్వింది.

మాంచాల తన కడుపులో పొంగుతూన్న విచారాన్ని బలవంతాన తగ్గించుకొంటూ "నీ కొడుకు నామెడలో తాళిగట్టి నా భ్రతుకు యెగతాళి పాలు చేశాడే కాని, తనపాలు చేసుకొనలేదు. ఆయనగారికి సానితోనే సంసారం, వేశ్యతోనే వైభవమైనపుడు" అని యింకా అనబోతుండగా ఐతమ్మ లేచి మాంచాల తలమీద చేయివైచి నిమురుతూ "నీ కన్యాయం జరగలేదని నేనడం లేదమ్మా! ఇది మన కుటుంబ విషయం. నీ విపుడు పుట్టింటివారి మర్యాద—మెట్టినింటివారి మర్యాదను కూడా కాపాడవలసిన చానవయ్యావు. ఇది విద్దూరము లాడుటకు పగ సాధించుటకు సమయం కాదు. సహన సంస్కారాలతో నీ భర్తను నీవీనాడు పరిదిద్దుకుంటే యిక మీద నీ బాధ నీవాడే కాగలడు. ఉత్తమాచర్య భారతాంనవు— నీ కర్తవ్యం నీవు విస్మరింప"కూడ దంటూన్న అత్తగారివంక నమాయకత్వంగా చూచుచున్న మాంచాల తలవంచి "సరే మీ కుమారుని మా యింటికి పంపండి. నా ధర్మం నేను కాపాడుకుంటా" నన్నది.

ఆ మాటలతో వెయ్యేనుగుల నెక్కినంత బలం వచ్చిన ఐతమ్మ కోడలును

ముద్దాడింది. వీపరాలికి వినయాంజలి చెప్పి తనవారితో తిరిగి తన మందిరానికి పోయింది. బాలచంద్రుని ప్రయాణంచేసి అత్తవారింటికి పంపింది.

సానితో సరసాలాడిన బాలచంద్రుడు

బాలచంద్రుని యుంప్పుడుడత్తె మొదటిపేరు సచ్చిమసాని. ఇపుడామె శ్యామాంగినిగా మారింది. అమ్మదగ్గరనుండి అత్తవారింటికని బయలుదేరిన బాలచంద్రుడు ముందుగా సానిమేడకు వచ్చాడు. ఎంతవారలయిన కాంతదాసులే నన్నట్లుగా వాకిట నిలబడగానే చరచర మేడమెట్లు దిగివచ్చి పరిచారిక "మాయమ్మ గారికి తలనొప్పి వచ్చింది" అనేగ్గా బాలుడు బిగ్గరగా "అటులనా ! కారెమపూడి యుద్ధానికి వెళుతూ నిత్యావసరములకు దబ్బిచ్చిపోదామని వచ్చాను. నా దగ్గరకు వచ్చి ధనము పుచ్చుకునే కులాసా లేదు కాబోలు. పోనీతే ప్రాప్తం లేని దానికి ప్రాకులాడడ మెందుకు? వస్తానని ముందుకు సాగాడు. అంతలోనే ఎదురయిగ శ్యామాంగి "మంత్రి కుమారులను పిలిచి మర్యాదలు చేయడం తెలియదా ! వైకి రమ్మనవేమే !" అని పరిచారికను మందలిస్తూనే సరసునకు స్వాగతం పలికింది.

"నేను రావడం నీకు తలనొప్పిగా నున్నదటగా" అని చిరాకుపడుతూ బాలచంద్రుడు ముందుకు సాగబోయాడు. "ఆగండి" అంటూ చేయి పట్టుకొనిన శ్యామాంగి "మీరు రాలేదనే నాకు తలనొప్పి వచ్చింది. మిమ్ములను చూచాక యింకెక్కడుంటుంది. అయినా యీమధ్య బొంగరాలాటలోనిది బొత్తిగా బాగం

దానిల్లు మరచిపోయినట్లున్నారు. అబ్బా రండి!" అని ఒక కొంచె చూపు చూచింది. బాటదప్పిన బాలచంద్రుడు ప్రియురాలివెంట మెల్లెక్కిపోయి మేడలోని పట్టు పరుపుమీద పవళించాడు.

వారకాంత పలపులు కురిపించింది. మోహావేశంలో మునిగిపోయిన బాలు డామెకు ఐదువేల వరహాలు సమర్పించి మేడమెట్లు దిగుతూండగనే బ్రాహ్మణులు వచ్చి దీవించారు...యాచకు లర్థించారు. వారిని సత్కరించడానికి చేతిలో చిల్లి గవ్వయు లేని బాలచంద్రుడు తనకై కాచుకొనియున్న చెలికాండ్రను చేరబిలిచి యీ బ్రాహ్మణులకు యాచకులకు నేదేని నీయుడని చెప్పాడు. కానీ స్నేహితు లందరూ మా చెంతనేమియు లేదని చేతులు వెల్లివలవై చారు. అది చూచి అను బోతుకు కోపం వచ్చింది. "ఏమి పని చేశావు చంద్రా ! మాయలాడి మమకారంలో బడి చేతిలో నున్న పొమ్మంతా పాని కర్పించావా! నీవు చేసింది దానమా ? ధర్మమా ! నీకు కలిగింది పుణ్యమా! పురుషార్థమా ? ఐదువేల వరహాలు బిడ్డల కిచ్చినట్లా? బిదలకిచ్చినట్లా? ఐంగారమున్నంటి భార్య చెంతకు పొమ్మని కన్నతల్లి కనికరించి పంపగా డాబిలో యీ దౌర్భాగ్యపు పనియేమి"టని మందలించాడు.

ఐదులు చెప్పలేకపోయిన బాలచంద్రుడు మొలనున్న ఐంగారు మొలత్రాడు తీసి వెలకు దొర్నడుచేత అమ్మకం చేయించిన ధనం విప్రులకు, యాచకులకు పంచి యిచ్చిన తరువాత గండువారింటికి పోయాడు. అల్లుడు ప్రాతవాడేగాని, ఆగమనం క్రొత్తయింది. ఇంటి యజమాని యుద్ధానికిపోయి యున్నందున అత్తగారే అన్ని మర్యాదలు చేయించారు.

అత్తవారింటికి వచ్చిన అందాల బాలుడు

బాలచంద్రుడు రత్నకంబళిమీద కూర్చున్నాడు. తియ్యని పండ్లు, తేనె పానకాల విందారగించాడు. కప్పురపు తాంబూలం సేవించి సుగంధ పరిమళ వాయువుల్ని పీలుస్తూ మత్తులో ఒత్తిగిల్లపోతున్నాడు—అభ్యంతర మందిరంలో చెలులంతా మాంచాలను రతీదేవిలా అలంకరించారు.

సౌందర్య దేవతయైన తన భార్యను చూచుకొని బాలచంద్రుడు చకితు డయ్యాడు. సంపెంగనూనెతో తలంటుకొని, పన్నీటి స్నానంచేసి, బంగారు జల తారు పరిగించు వలువలు ధరించి వచ్చిన మాంచాలను చూచి మన్మధరాజీయని వర్ణింపసాగాడు. "అహా! ఏమా అందం? ఆ చందం అలివేణి తలలోని పూల చెండున కెంత వెలుగొచ్చింది! ఆమె నొసట దిద్దిన తిలక మెంత సుందరముగ నున్నది? ఆ కొప్పుమీద నున్న రాగిడి. ఆ ముక్కునున్న ముత్యాల ముంగిటు. ఆ చెవులనున్న సరాలు. ఆ కంఠసీమ యందున్న రత్నహారం. ఆ దండచేతి యందున్న బంగారు కడియం, ఆ ముంజేతులయందు మోహన శ్రుతులు పల్లుకు తున్న కంకణాలు. ఆ పాదముల నంటియున్న అందియ లెంత పుణ్యము చేసికొన్నవోగదా!" అని అనుకొంటున్న తన్మయంలో తన్ను తాను మరచి పోయాడు.

మాంచాల ముందు శ్యామాంగి అందగత్తె కాదనిపించింది. ఇంతకాలం నేనీ సుందరాంగిని కన్నెత్తి చూడనైనా చూడక యెంత పొరపాటు చేశానను కున్నాడు బాలచంద్రుడు. మరికొంతసేపటికి మాంచాల వచ్చి పన్నీటి పతిపాదాలు కడిగి గౌరవించాక మరొక శృంగార మందిరంలోని కాహ్వానించింది. హంస

తూలికాతల్పంమీద కూర్చున్న బాలచంద్రుడు మాంచాల అందించిన తాంబూలం సేవించాడు. ఆయన మనసులో ఏవేవో మధురభావాల తరంగాలుగా పెల్లుబికి వస్తున్నాయి. అది గమనించిన మాంచాల తల్లి చెంతకుపోయి "అమ్మా రాక రాక యిన్నాళ్ళకు వచ్చారు మీ యల్లుడుగారు. నేనీనాటికి వారిని చూచి సేవింపకలిగానే కాని నా జీవితాన్ని ఆనందమయం చేసుకోలేకపోతున్నాము. నాకిపుడు కర్తవ్యమేమి"టని అడిగింది.

రేఖాంబ కుమార్తెను బుజ్జగించుతూ "నిజమే తల్లీ, నీ దురదృష్టాన్ని తలంచుకొని నేను మీ నాన్నగారు పడుతూన్న బాధ నీకు తెలియదనుకుంటాను ! ఏదేమైన నీ విషయం చేయతగిన త్యాగం కష్టతరమయింది. అమ్మా ! ఈ ప్రపంచంలో మానవులకు కావలసినవి ఒకటి భోగం రెండు త్యాగం శాశ్వతమయింది కూడాను. ఇతే దానిని సాధించడం కష్టమైనవి. నీ పెనిమిటి యిపుడు రణరంగంలో ప్రవేశింప బోతున్నాడు. యుద్ధానికి పోయే భర్తనాపడం వీరపత్ని లక్షణంకాదు. పతికి రణవిరుదము పేరు రారానిది. సంగ్రామము సేయబోవు పురుషునకు స్త్రీ పొందు తగదని పెద్దల నిర్ణయంబగుటచే నీవాతని కపకారం చేసిన దానవయ్యెదవు. అదీగాక సమరమున లభింపనున్నది విజయమో—వీర స్వర్గమో నిర్ణయింపగల వా రెవ్వరును లేరు. దైవమనుకూలింపక బాలుడంతరించిన యెడల నీవిక ముందనుభవింపగల దేదియును లేదు. కావున నీ కర్తవ్యమును గురించి నేనెటూ చెప్పలేక పోతున్నా"నంటూ కంటతడి పెట్టుకుంది.

తల్లి తనతో చెప్పలేక తటపటాయించుచున్న దెందుకో గ్రహించిన మాంచాల అర్థం చేసుకున్నానమ్మా ! ఇంతకాలం అడవిన గాచిన పండు వెన్నెలలా గడిచిపోయిన నా జీవితం యీ యొక్కరేయి యొందిలిపడి శూన్యమేమి ప్రయోజనం? ఏడేండ్ల నాటివలెనే నా భర్త యీనాడు కూడా నా యింటికి రాకుండానే యుద్ధానికి పోయారనుకుంటా"నంటూ బాలచంద్రుని యొద్దకు పోయింది.

యుద్ధం మాట పూర్తిగా మరచిపోయి మోహంలో బడిన బాలచంద్రుని మనసు నింతకుముందే గుర్తించిన మాంచాల మంచి మాటలతో పాటలతో ఆటలతో రేయంతా గడిపింది అంతలో తెలవారిందని కోళ్ళు కొక్కొరొకో యని కూసినై. అంతవరకు ఓపికపట్టిన బాలచంద్రుని అనుచరులు గండువారింటి ముందుకువచ్చి చప్పుడు చేశారు. అంతటను బాలుడు మేడదిగి రానందున వారంతా కత్తులు చూసి గట్టిగా యరిచారు. అది చూచి అంతఃపురాంగనలు భయపడ్డారు. మంచాలమీది మమకారంతో పోరుమాట పూర్తిగా మరచిపోయిన బాలచంద్రుడు వాకిట నున్న పోరు తమ్ములన్న యోచనయు లేక కరవాలం దూసి తమ్ములమీద తారసిల్లాడు.

మాంచాల దీవెనలు పొందిన మంత్రి కుమారుడు

ప్రతాపంచూపి పరుగెత్తివచ్చిన బాలచంద్రుని చూచినంతనే సోదరులంతా పక పకా నవ్వి "చంపవలసిన వైరులంతా కారెమపూడి యొద్దనుంటే-నీ విక్కడ గండు వారింటిముందు మాంచాల చూస్తూండగా తమ్ములమీద తారసిల్లితివా! భళే యోధుడవయ్యా బాలచంద్రా! అలరాజు చనిపోయినపుడు మీ తండ్రి కొమ్మరాజున కిచ్చిన వాగ్దానం మరచిపోయావు-నీవు చేసిన ప్రతిజ్ఞ నిరుపయోగం కావలసిందేనా? ప్రతిన చేసినంతటనే ప్రయోజకుడవు కాపు- ప్రతిన చెల్లించినపుడు సమర్థుడవు. మలిదేవ మహారాజు నీకు భేతాళ ఖడ్గము— కాలిపెండెరములు పంపియున్నాడు. యుద్ధరంగం పిలుస్తూంది. రాగలిగితే గడపదాటి కదనరంగానికి రా! నీవు రాకపోతే మేమే పోయి మావంతు మేము చేసి వస్తా"మన్నారు. ఆ మాటలు విన్న బాల చంద్రుడు లజ్జపడి తిరిగి మాంచాల చెంతకు పోయాడు.

మంచాల వెనువెంటనే మగనికి కర్పూరహారతి నిచ్చింది. వీర కర్పూర తిలకం మోమున దిద్దింది "కదనరంగంలో మీ కెదురు లేకపోవుగాక-గరుత్మంతుని బలం-వాయుదేవుని తీవ్రం-సూర్యదేవుని ప్రతాపం—శ్రీకృష్ణుని కీర్తి కలిగి శత్రువులను జయించెదరుగాక" అని దీవించి వీరభద్రం చేతికందించి వీడ్కోలు చెప్పింది.

బాలచంద్రుడంతట తల్లియొద్దకు వచ్చి చక్కగా స్నానంచేసి భోజనాంతరమును తల్లిదీవెనలు పొంది తమ్ములతో గూడా వీరమేడపినుండి బయలుదేరి త్రిపురాంతకం చేరినాక ఒక రావిచెట్టుక్రింద కూర్చున్నాడు. అనపోతు చెంతలేని సమయంచూచి మిగిలినవారితో "తమ్ములారా! మీకొక రహస్యం చెబుతున్నాను. మనలోని అనుపోతు బ్రాహ్మణుడు, ఆయన మనతోబాటు యుద్ధానికి వస్తున్నాడు. రణరంగంలో చావో బ్రతుకో తెలియదు. బ్రాహ్మణ హత్యాపాతకం మన కాపాదింపరాదని యింటియొద్ద నాకు మీ వదిన చెప్పింది. అందుగురించి మనమిపుడీ అనుపోతును వెనుకకు పంపే ఉపాయం చేయాలి.

•

"నేను నా ముత్యాల కంఠమాల ముద్దుటుంగరం మాంచాల మందిరంలో మరచిపోయాను. నీవు పోయి మీ వదిననడిగి తీసుకొనిర"మ్మని అనపోతు వింటూండగా మీకు చెప్తాను. అపుడు మీరంతా యెవరికివారే యేవో సాకులు చెప్పి మేము వెనుకకు పోమని చెప్పండి. అంతట నేనాతనికి పురమాయించి తిరిగి వీరమేడపికి పంపిన తరువాత మనమిటు ముందుకు సాగిపోవుద"మని చెప్పాడు. వారంతా సరే నంటే సరేనన్నారు.

ఇంతలో అనపోతు వచ్చి వారిని కలుసుకున్నాడు. బాలచంద్రుడు తన కప్పటికప్పుడే గుర్తొచ్చినట్లు నటించి "నేనా గండువారింట నా ముత్యాల కంఠమాల, ముద్దుటుంగరం మరచిపోయి వచ్చాము. యుద్ధానికి బయలుదేరిన నేను వెనుకకు పోవడం మంచిదికాదు. మీలో ఎవరైనాపోయి మీ వదిననడిగి తీసుకొని

రం"దని ముందుగా తమ్ములార్వురను పేరు పేరున పిలిచి చెప్పాడు. వారంతా తగిన సాకులుచెప్పి యీ పని మాదికాదని తప్పుకున్నారు.

బాలుండంతిటు అనుపోతుతో "తమ్ముడూ! ఇక ఈ పని నీకు తప్పదయ్యా అదేగాక మంచాల దగ్గర నీకున్న చనువు వీరిలో యెవరికిని లేదు. వీరు నిజముగా నా తమ్ములలోని వారేనని గండువారమ్మాయి పోల్చుకొనలేక పోవచ్చును కూడా. నీ వందునా నా వెంటనుండి మీ వదినకు పరిచయమైనవాడవు. శుద్ధచాందస బ్రాహ్మణుండ వగుట నీ వబద్ధమాడవనియు నమ్మవచ్చును. కావున నీవు త్వరి తంబుగా పోయిరావలయు"నని మొగమాట పెట్టాడు. అనపోతింక కాదనలేక నేను తిరిగి వచ్చేవరకూ మీరిందే ఉండవలయునని చెప్పి తన గుర్రమునెక్కి వీరమేడపికి తిరిగి వెళ్ళాడు.

ముత్యాల హారము-ముద్దు టుంగరము

అనుపోతును వెనుక కంపిన బాలచంద్రుడు ఆకుమీద ఘంటంతో "తమ్ముడూ! పోతూ! నీవు బ్రాహ్మణ బాలుండవు. సమరమున సమయుదు వేని మాకు బ్రహ్మహత్యా పాపమంటగల"దను తలంపున మాంచాల నాకు "నిన్ను రణరంగమ నకు గొనిపోవల"దని చెప్పింది. ఆ కారణంగా నీకు నేనబద్ధం చెప్పి వెనుకకు పంపాను. నా మాటయందు గౌరవముంటే నీవీ త్రిపురాంతకం దాటి ష్ణుదుక్కు రావొద్దని అన్నగా నిన్నాజ్ఞాపించుచున్నాను. నా మాట మీరితివేని శ్రీశైల మల్లికార్జున స్వామి మీదాన-చెన్నకేశవ స్వామిమీదాన-బ్రహ్మనాయుని మీదాన—మలిదేవుని మీదాన—నా మీదాన" అని బ్రాసి వారు కూర్చుండిన రావి చెట్టుకొమ్మకు గట్టిన తరువాత అనుజుల వెంటబెట్టుకొని ముందుకిపోయి నలగొండ నెక్కి దిక్కుల కలియజూచాడు.

ఎక్కడ చూచినా యెడతెరిపిలేని సేనలతో కారెమపూడి మైదానమంతా కదనభూమి కాబోతూంది. సైనికులు నివసించే గుడారాలు. ప్రభువులకు ప్రధానోద్యోగులకు, పరివారాలకు తగిన తాత్కాలిక భవనాలు, వంటచేసే పాకలు-ఆయుధాలను భద్రపరచే శాలలు-ఆహార పదార్థాలు నిల్వలు చేసిన గిడ్డంగులు-వైద్య శిబిరాలే కాకుండా గజశాలలు, అశ్వశాలలతో కదనభూమి కోలాహలంగా వున్నది.

ఆ రణగోణ ధ్వనులు వినడంతో బాలుని కావేశ ముప్పొంగింది. వెలమ దోర్నానుని పిలిచి "ఈ శిబిరంబులెవరివో వీని హద్దులేవో-చెప్పగలవా!" అన్నాడు. వెలమ దోర్నడంతట "అన్నా! నలగాముని సేనలు నాలుగు చెరగుల నిండియున్నవి. నేల యీనినట్లున్న ఈ జనంమీద యిసుక చల్లినను క్రిందపడడము లేకున్నది. గురిజాల సేనల కెల్లలు చూచితివా! తూర్పుదిక్కున జువ్వల కల్లు సన్నెగండ్ల గ్రామముల దాకుచున్నవి. ధక్షిణపు దిక్కున నాగులేటికి తూర్పు నలకొండయు పప్పిచర్ల పురముల నాక్రమించినది. పడమర దిక్కున కొదమ గుండ్ల చింతపల్లి వాడసంటుచున్నది. ఉత్తరపు దిక్కున జన్నిదేవగుళ్ళు సవనాల మేడ వంగతోటబైలు సింగభూపల్ చెరువు సంగడిగుళ్ళు ఉత్తరేశునిగుళ్ళు ఉయ్యాల కంబముల దాకి- కలజువ్వి చుట్టి నలగొండ నొరసి నాగులేరు నంటుచున్నవి.

అంతియేకాదు-ఈ సేనల నాయకత్వములు వహించిన వారెవరో చూచితివా? తూర్పున నాయకురాలు నాగమ్మ కాచియున్నది. దక్షిణమున అందెలరాముడు, నెమలిపురి ముమ్మిడిరెడ్డి పొందగలిగిన భూపాలకుడైన వీరమల్లులు వేచియున్నారు.

ఉత్తరమున నరసింగరాజు పొంచియున్నాడు. పడమర పొజుల బ్రహ్మనంగోజి గణపతులు నిలిచియున్నారు.

ఇక మనవారైన మలిదేవుని శిబిరంబులను తిలకింపుము. అందరును పేరాది పేరులే. మన పరివారమునందలి ప్రతియొక్క వీరుడును శత్రుసైన్యములమీదపడి

లక్షమందిని చంపగల బలవంతులు. ఆలమందల జొచ్చి చితకు పరచు సింహపు పిల్ల లట్లు నలగాముని సేనల మొనరింప తొందరపడుచున్నా"రని నంతనే బాలుడు "తమ్ముడూ ! నా రాకకై రాజెందురు చూచుచుండెనేమో-త్వరితముగా పోవుదము పద" అంటూ కొండదిగి సైనికుల నడుమ దారి చేసుకుంటూ పోయి మాచర్ల రాజుల శిబిరాల చేరుకున్నాడు.

మలిదేవుని సందర్శించిన బాలచంద్రుడు

అదే సమయమున రాజసభల్లో రాయబార చర్చలే జరుగుచున్నవి. కారెము పూడిచేరియుద్ధరంగంలో శిబిరములు వేయించిన నలగామరాజు కొడమగుంట్లపౌరుల కిచ్చినమాట మరచిపోక తన పరివార మందాంతరంగికులను పిలిచి మనమిప్పుడు బ్రహ్మనాయునకు సంధి యేమని చెప్పి పంపుద"మని ప్రశ్నించాడు.

అందుకు సమాధానముగా నాగమ్మ "రాజా ! బ్రహ్మనాయుడు చేసిన ప్రభావం వలన కొమ్మరాజు మొదలైన వారి హృదయాలలో అలరాజుమ చంపింది నరసింగరాజేనను నమ్మకం నాటుకుపోయింది. వారంతా నరసింగరాజు తల నరికి ప్రతీకారం చెల్లించుకోవాలనే పట్టుదలతోనున్నారు. దానికి మనమంగీకరింపము తనుక సంధి కుదరదని నిర్ణయించి చెప్పింది.

నరసింగరాజంతట "అన్నయ్యా ! నా మరణంతో సమరం నిలిచి పోతేమో బాగుంటే నేను తప్పకుండ పగవారికి పట్టుబడడానికి సర్వసిద్ధంగానున్నా"నన్నాడు జంకుగొంకులు లేకుండా. ఆశ్చర్య మొందిన నాగమ్మ వెంటనే "నరసింగరాజా ! నాగమ్మ యాజమాన్యంలో నిర్దోషులు శిక్షింపబడరాదు. ఆదర్శనీయమైన నీ నీతి నిజాయితీలు తెలియకనా నీయట్టి మహోత్తమ బుద్ధిశాలిని పగవారికి పట్టి

యీయడము ? మీరిట్లు మాటాడ తగ"దని మందలించింది. నలగామరాజు గూడ "తమ్ముడూ ! నీ యన్న నీవనుకున్నంత నీచస్థాయికి దిగజారి పోలేదయ్యా ! ఒక వేళ నీకు మరణదండనే విధింపవలసివచ్చిన యెడల ఆ సాహసము నేనే చేయుట యందు కొంత న్యాయముండునేమొ కాని యింకొకరిచేత చేయించుటకన్న నీచ కారణమేముం"దన్నాడు.

తిరిగి నరసింగరాజు "ప్రభూ ! నేనిది మనసారా చేసిన నిర్ణయం. మీరాలో చింపదగినదనియు లేదు. ఇపుడు కావలసినది నా న్యాయవర్తనము కాదు. ఈ యుద్ధంలో కొన్ని లక్షలమంది ప్రజలాహుతి కాబోతున్నారు. నేనొక్కండనే చని పోయి యుద్ధమాపుదల చేయించిన యెడల వీరందరూ కొంతకాల మీ భూమిమీద బ్రతికి యుండగలరు. ఎందరో తల్లులకు పుత్రశోకము లేకుండగను ఎందరో యిల్లాండ్రకు వైధవ్యము రాకుండగను ఎందరో బిడ్డలను తండ్రిలేనివారు కాకుండ గను చేసినవాడనయ్యెదను. కావున నన్నా విరోధులెన్ని నరకయాతనలు పెట్టి చంపి నను సమ్మతమేనని యిందులకు నాకై నేను ముందుకు వచ్చాను. కనుక "మీరు యుద్ధం విరమించుకునే పక్షంలో నేను నా తమ్ముని త్యాగం చేయగల"నని చెప్పి రాయబారం పంపండి" అన్నాడు.

నలగాముడింక మాటాడలేదు.

నాగమ్మ దూరాలోచించింది. నరసింగరాజు మహాశయానికి జోహారులర్పించింది. నలగామరాజు ధర్మ సంకటాన్ని గమనించింది. ప్రభూ ! భయమెందుకు మలిదేవాదులకు కావలసింది యుద్ధంగాని నరసింగరాజు కాదు. కాకపోయినా "అలరాజును చంపిన నరసింగరాజంతము చూడా"లన్నదొక సాకుమాత్రమే. నరసింగరాజు షేరద్దము పెట్టుకొని యుద్ధమున కెత్తివచ్చిన యెడల సంధికంగీకరింపరు కాని యెడ నంగీకరించెదరు. ఆదీయు చూచెదము గాక" అని కొంత అన్నమరాజుల కోట కేతుడు, మాడుగుల వీరారెడ్డి, చింతపల్లి రెడ్డి యను ప్రజ్ఞావంతులైన వారికి చెప్ప దగిన మాటలు చెప్పి మలిదేవుని చెంతకు రాయబారం పంపించింది.

యువక సోదరుల యుద్ధోన్మాదము

రాజదర్శనము కోరిన నలగామ దూతలకు మలిదేవుడు తగిన మర్యాదలు చేసి కూర్చుండ నియమించిన తరువాత "మీరు వచ్చిన పనేమిటి ?" అని అడిగాడు. రాయబారులు వినయంగా "రాజా ! ఉభయులకును యుద్ధము క్షేమముకాదు. గడిచిన దానిని తవ్వుకొనుటయు మంచిదికాదు. మీరు కోరిన పెద్దముగ నరసింగ భూపతిని మీరు దండింతురా ? ప్రశ్నింతురా ! అను ప్రశ్న లేకుండా మీ కప్పగించుటకును, మాదర్ల మీకిచ్చుటకు గూడ గురిజాలవారు సిద్ధముగనున్నారు. మీరు సంధి కుదిరించి దేశమున శాంతిభద్రతను కాపాడవలయు నని మా విన్నపము.

మీకు తెలియని ధర్మములు లేవు. పూర్వము బహు ప్రయాసలబడి కౌరవులను చంపిన పాండవులు పట్టముకట్టుకొని సుఖపడినదేమున్నది ? బంధునాశనము గురించి వాపోయిరికారా ! మీలో నెవరంతమొందినను అనుగురాజు సంతానమేనను మాటను గుర్తించుకొని సంధి యొనరించుటయే మంచి"దని వివరించారు.

ఆ మాటలు విన్నవారందరు "సందేశము న్యాయసమ్మతమయింది. సంధి కుదరటమే మంచిదనుకొనే సమయంలో బాలచంద్రుడు రానేవచ్చాడు. అతనిని చూచినంతనే సభలోనివారంతా యిక సంధి కుదరదని నిశ్చయించుకున్నారు. వారిలో నెవరును బాలచంద్రుని గౌరవించి బాటనీయలేదు. బాలచంద్రుని రోషం పెరిగిపోయింది. ప్రక్కవారలను చూడకయే దన్నుకుంటూ దూసుకుపోయి మలిదేవునకు నమస్కరించి "మహారాజా ! మీతో యుద్ధభూమికి రాలేకపోయిన బాలుని నన్ను మన్నింపు"డన్నాడు.

కన్నమదాసంతట మండిపడుచు లేచి "బాలచంద్రా ! ఇక్కడనున్న మా యందఱికన్న నీవేమొ మహారాజుగారి కాత్మీయుడన్నట్లుగ మమ్ముల తన్నుకొనుచు పోవుట కెవరికంపె గొప్పవాడవు ! నీకి యధికార మెవరిచ్చారు ? నీకంత గుండె బలమున్నచో నాతోడ పోరాడరమ్ము. నియంతు చూస్తా"నంటూ పరవళ్ళ్రొక్కడం చూచి బాలచంద్రుడు తొందరపడక "అవునులే నేను సాటివారికి చెప్పకయే సమర మాడ వచ్చితినా—వచ్చినవాడు నిచట చేతులుగట్టుక కూర్చుంటినా ?-కుదురుగా కూర్చుండి సంజ రాయబారము తిలకించుచుంటినా ! రణశూరుడవు నీవుగాక నేనెట్ట య్యెదనులే" అని యెత్తిపొడుపు మాటలాడాడు.

అగ్గిమీద గుగ్గిలమయ్యాడు కన్నముడు "ఓయీ ! అవివేకి ! పిల్లకాకి ! బొంగ రాలాటలాడి బుద్ధి చెప్పించుకొని-వేశ్యకొంపకు పోయి విత్తం పోగొట్టుకొని-అత్త వారింటి మర్యాద నంతంత మాత్రముగ ననుభవించి మలిదేవుని దగ్గర మాట దక్కించుకొనవచ్చిన నీవు నన్నెగతాళిచేయు నంతటివాడవా ? బ్రహ్మనాయులవారి యనుమతిలేక భయపడు చుంటిమిగాని కదనరంగమున కత్తిదూయలేకకాదు" అని వేశాడు-ఆవేశపూరితంగానే.

"బ్రహ్మనాయుని యనుమతిలేక భయపడడానికి నీకు బ్రహ్మనాయునికున్న సంబంధమేమిటి ?" అని సూటిగా అడిగాడు బాలచంద్రుడు.

కన్నముడు వెనువెంటనే "పలనాటి శ్రీకృష్ణపరమాత్మ బ్రహ్మనాయుడు, అయన రాజకుటుంబానికే రక్షకుడు, ధర్మము మూర్తీభవించిన దైవరూపము, తెప్పలి నాయకుని భార్య పెమ్మసాని, పెమ్మసానియండు నేను బ్రహ్మన్న కరుణతో బుట్టినవాడను. మారి కభిమానపుత్రుడను-భుజములమీద గురుముద్రలు కల్పించు కొనిన గురుతర భక్తుడను. నాన్నగారి పాదసేవకుడ-ఆజ్ఞా పాలకుడను. నేనే బ్రహ్మన్నకు పెద్దకుమారుడను-నీవు నా తదుపరితనాడ"వంటూ తన గొప్పతన మంతా చెప్పుకున్నాడు.

బాలున కిప్పుడింకొక వీలు దొరికింది. తండ్రికి పెద్దకుమారుడవు నీవై తే, తలదన్ని పుట్టిన తమ్ముడను నేను. అన్న తొడలు ద్రొక్కుటకు తమ్ముని కధికార మున్నది. మలిదేవుల వారిని జేరడానికి మార్గమియకపోయారు మీరు. తొందరపడి త్రోసికొని వచ్చాను నేను. శత్రుసేనలు సముద్ర తరంగాలుగా పెరుగుతున్నాయి అవి మనమీద విరుచుకుని పడకముందే మనం ముందుగ తొందరపడి పగవారి బల గంబుల పల్బబడచేయడ మవసరమని మీ యందరకు గూడ మనవి చేస్తున్నాను. ఇందులో తప్పుంటే నన్ననండి" అన్నాడు. కపటములేని కన్నమదాసు నవ్వుతూ కత్తి నొర యందుంచి తమ్ముని కౌగిలించుకొని యెత్తిదించాడు. వీరావేశమున తార సిల్లిన అన్నదమ్ములిద్దరూ ఆలింగనము చేసుకున్నారు.

బాలచంద్రు డాడిన పోటు మాటలు

మలిదేవ భూపతిని బ్రహ్మనాయుడు మంత్రియే గైనను మంత్రికన్న మించిన మార్గదర్శకుడయ్యాడు. వీరవిద్యాదేవి కుమార్తు కన్నతండ్రి అనుగు రాజును చిన్నతనంలోనే కోల్పోయినందున వారి మంచిచెడ్డలు చూచినవాడు బ్రహ్మనాయుడు గారంటె వారికి నారాయణమూర్తియన్న నమ్మకం. ఈ కన్నమ బాలు లిద్దరూ నాయునికి రెండు కన్నులవంటివారు. ఆ ముద్దు సోదరులు పంతా లాడు కొనుచుండ నెవరి నేమనవలయునో తెలియని పరిస్థితిలో తికమక పడ్డాడు. కాని వాని కా పని లేకుండానే వారిద్దరూ రాజీపడడం మేలయింది. ఒక విధంగా ఆ అన్నదమ్ముల సంవాదం కొంతమందికి వినవేడుకయింది కూడాను.

భుజ్జబారం తలమీద నుండి కూడా యీ అన్నదమ్ముల వింత వివాదం చూచుచున్న తన్మయంలో నుండి యింకా ఈ ప్రపంచంలోనికి రాలేకపోయాడు

మలిదేవుడు ఆ కాస్తలోనే తొందరపడిన బాలచంద్రుడు "అలరాజును చంపిన వానితల మూడు నెలలలో నరికేయాలని మనమంతా నిర్ణయించుకున్నాం. కాని యిచ్చిన మాచర్లనగరం పరాయివారికి స్వాధీనం చేసి-కుంట కుంటల నీరుత్రాగి ఆకు తూరలు దిన్న పసరు తలకెక్కి కర్తవ్యం తెలియకున్నా"పని రాజమోషణ కుపక్రమించాడు.

బాలుని ధీరజి పెడత్రోవన బడడం గమనించిన కన్నమనీడు వాని నా మార్గము నుండి మఱలింప నెంచినంతన వెంటనే జోక్యము కలిగించుకొని "చంద్రా! తొందరపడుచున్నావు. మలిదేవులు మన ప్రభువులన్నమాట మరచి పోరనిది. రాజ సమక్షమున నుండ సేవకులు కొన్ని పరిధులమీరి సంచరింప రాదు. మన యిచ్చవచ్చినట్లు సంచరింప నెంచిన మొదల రాజేంద్రుని వెంటబెట్టు కొని రారాదు. మలిదేవుని తోడ్కొని యుద్ధమునకు వచ్చుట మొదటితప్పు — త్రిపురాంతకము నందున్న వేల్పు కంబము నందే యుంచి పూజించుటతో విర మింపక దానిని పెకలించుట రెండవతప్పు-కయ్యమునకు కాలు కదిపినపుడే ధరింపబడిన వీరకంకణములను కొంతదూరం వచ్చినాక కంకణాల పల్లెలో గట్టు, కొనుట మూడవతప్పు-వచ్చినవారము వెంటనే కత్తిమాయక పగవారి సేనలు ప్రబలములై వచ్చువరకు నుపేక్షచేయుట నాల్గవతప్పు-నలగాముని పక్షమువాడు రాయబారమునకై వచ్చియుండ వారిముందు మనమిట్లు అనైక్యతతో కలహించుట ఐదవతప్పు, తప్పులన్నియు మన ముందుంచుకొని ధరణీశు లనుకొందులకు ? ఇచ్చ యున్న విచ్చుకత్తి చేబూని యుద్ధమొనరింపుము; మనసొప్పకున్న మరలిపో"మ్మని నిర్మొహమాటంగ అనేశాడు.

బాలచంద్రు డంతటు హుంకరించుచు "మనసొవ్వకున్న మరలిపోవుటకే బాలచంద్రుడు భయపడుటలేదు. చూర్పు సూర్యుడు పడమట పొడిచినా - సముద్రములు పొంగి భూతములపై జలప్రళయం కలిగినా-కుల పర్వతములేడును పెకిలి మని పగిలి భూమి పద్దరిల్లినా-మింటి చుక్కలు కాలినా-అగ్ని చల్లారినా బ్రహ్మ నాయుని ప్రయత్నం భంగం కానేరదు. నేను బాలుడినైతననేమి ? కాలకాలుడనై పగవారి మూకలపట్టి చెండాడక విడిచి పెట్టువాడను కాను-నరసింగుని తలద్రుంచి నాటి శపథం చెల్లింపక చేతులు ముందు పెట్టుకుని కూర్చుండుటకు చేతగాని వాడనుగా"నన్నాడు ధీమాగా.

మామా! కొమ్మరాజా నీ కొడుకును చంపించిన వారితో నీవు సంధి చేయ చూచుచున్నావా ? నీ పౌరుషము చచ్చిపోయినదా ? నీ కత్తి మొక్కవోయినదా ? లేవకుంటివేమి ? కాశివిగించి, కత్తిరుళిపించి, కదనరంగమున పగర కండల చెండాడక సందేహించుచుంటివేమి ? —బావా నాయుడా ! నాడాడిన పౌరుష వాక్యములను మఱచిపోయితివా ? లేక నిద్రపోవుచుంటివా? కాక, సమరంగమును చూచి పిరికివాడవైతివా? మూడునెలలు గడవు దాటిపోయినా మీలో చలనం కనబడదేమి? మామా ! కన్నమనీడ! మగమీటి లేదటయ్య నీకు? త్రిపురాంతకము నుండి గొని వచ్చిన కంబమున కిచుట తలదంటి పోవుచున్నది. కార్యభారమున కన్ను మూయవచ్చునా! సుందరామా! చెవుల నాయకులారా! జంకి వినాయకులారా ! పెనుమాల వీరులారా! సొంపేట నారన్నా? మీరంతా యేమి చేయుచున్నారు? శత్రు సేనల మీద సాహసించి యీ యుద్ధంలో మొట్టమొదటిసారిగా యెదుటి వారిని పొడిచిన తొలిపోటు నాదని చెప్పుకొన గల వారెవరును లేరా!" అని సైనికుల సము

రోత్సాహమును కలిగించుచుండ బ్రహ్మన్న లేచి కుమారుని సమాధాన పరచి కూర్చుండ నియమించాడు.

అనపోతు పంపించిన ఆనవాలు

కొమ్మరాజు బాలచంద్రుని సమీపించి భుజముమీద చేయివై చి "చిరంజీవీ! నీవనుకొనునట్లే కాగలదు. కాని, తొందరపడక నా మాట లాలకింపుము. కుమారుని కోలుపోయిన నాకు కుదురుబాటు కూడానా? నిజము చెప్పవలెయునంటే అలరాజు మరణవార్త విన్ననాడే నేను నిన్నలరాజు స్థానంలో చూచుకొని ఊరటచెందాను. చూడు నాయనా! యుద్ధానికి వచ్చిన శత్రువులు భయపడ్డారు. రాజపౌరుషం కోల్పోయినారు. పరువు మర్యాదల నొదులుకున్నారు. తమ్మునిగూడ మన కప్పగించుతా మన్నారు. క్షత్రియుల కంతకన్న నవమానకరమైన దేమున్నది ?

పరమశత్రువైనను పాదాక్రాంతుడైనపుడు ప్రాణములు దీయుట పాపకరము. సంధిపడి నంతమాత్రమున శౌర్యహీనులము కాజాలము. అలరాజును చంపించినది ఒక నరసింగరాజు-అతనికి తోడైన నాగమ్మ లిద్దరే కదా! ఇరువురిమీద పగసాధించుట కిన్ని లక్షలమంది ప్రాణములను మనము తీయుట న్యాయమా! అందుకని మహారాజావారు- మీ నాన్నగారు సంధికాహొదించుట మంచిదనుచుండిరే కాని సమరమాడలేక కా"దనినంత బాలచంద్రుడును బదులాడలేకపోయాడు. సంధి కుదిరి నట్లేనను నిశ్చయమునకు వచ్చిన వీరులంతా యిక యెటువారకు వెనుకకు తిరిగిపోవుటమునుకొనుటచే భోజనములు సేయుటకు కూర్చున్నారు.

వారందరును అన్నములు కలిపి తొలిముద్దలు నోటబెట్టబోవు సమయాన మేడపినుండి వచ్చిన మాడచి యొక చిన్నపెట్టి బాలుని చేతి కందించింది. బాలు డాతురతతో దానిని తెరచిచూచాడు. అందులో నెత్తుట తడిసిన జందెమున్నది. అది తన ప్రియమిత్రుడైన అనుపోతు జందెం. దానిని చూచినంతనే బాలచంద్రు నిలో సేయుమాని బాలునివంక చూచారు.

త్రిపురాంతకం నుండి వెనుకకు పంపబడిన అనపోతు సరాసరి వీరమేడపికి పోయి మాంచాలను సమీపించినంత నా గండువారమ్మాయి వానిని కూర్చుండ నియమించి తగు మర్యాదలు చేయించింది. అనపోతంతట "వదినగారూ! కూర్చుండ నాకు తీరికలేదు. బాలవీరులు త్రిపురాంతకం దగ్గరున్నారు ముత్యాలహారం ముద్దు టుంగరం మా అన్నగారిచట మరచిపోయినారట. వానిని మిమ్మడిగి తీసికొని రమ్మని బాలుడు నన్ను నియమించియున్నాడు. త్వరితముగ యిచ్చిపంపు" మనిన మాంచాల ప్రశాంతముగ మరిదీ! మీ యన్నగారిచట మరచిపోయినదేమియును లేదు. మీ యన్న నీకి మాయమాటలు చెప్పిన మర్మమేదియొ తెలిసికొనవయ్యా" అన్నది.

అయోమయ స్థితిలో పడిపోయాడు అనపోతు. మంచి ముత్యాల హారమీయ దానికి మాంచాల తన్ను నమ్మలేదేమో ననుకొనినందున తిరిగి "వదినమ్మగారూ! నేను బ్రాహ్మణుండను, అబద్ధమాడను. అంతవరకు పోయిన చంద్రుడు వెనుకకు

తిరిగి రాకూడదని సన్నిహితులకి నియమించాడు. వారంతా నా రాకకై వేచియుందురు. కావున నేనింకాలశ్యము సేయరాదు. ఒకప్పుడు నేనబద్ధమాడి ముత్యాలమాల ముద్దు తుంగరంబుల నపహరించానానే యనుకో-అప్పుడు బ్రాహ్మణుని కిచ్చాననియైన తృప్తిపడవచ్చును. కావున సందేహింపక వానిని నాకిచ్చి పంపించు"మని యడిగాడు.

ఆ మాటలకు చిరునవ్వు నవ్విన మాంచాల "అయ్యా నీవు బ్రాహ్మణుండవు కనుకనే నిన్ను మీయన్న యుద్ధమునకు గొనిపోక వెనుకకు పంపినాడు. యుద్ధములో గెలుచువారెవరో-చచ్చువారెవరో మనం చెప్పలేము. ఒకవేళ నీవు మరణించెదవేని బ్రాహ్మణహత్యా దోషమాపాదించుకొనను భయమున నీవు నూరేండ్ల పాటు జీవించి యుండవలయునను తలంపున నీకి మాయమాటలు చెప్పినారే కాని వారి వస్తువులిండేమియును మరచిపోలేదు నేను నీకు నిజము విప్పి చెప్పితిని. నీవింక యీ వీరమేడపిలో సుఖంగా జీవించుచుండు"మని చెప్పింది.

అంతట అనపోతు మనసు వికలమైపోయింది.

సరాసరి త్రిపురాంతకం పోయి బాలచంద్రుని కలిసికోవాలనుకున్నాడు. కాని, అంతలో వాని మనసున కింకొక ఆలోచన కలిగింది. "నేనందాకా పోయి మాంచాల మందిరాన నీవు చెప్పిన వస్తువులు లేవని చెప్పగానే బాలచంద్రుడు జాడ గరచి పొను సుమా పొరపాటు జరిగింది. నేను వానిని మరచింది మాంచాల మందిరంలో కాదు-శ్యామాంగి సౌధంలో మరచిపోయాను. మళ్ళిపోయి రమ్మంటాడేమో ననే అనుమానం వచ్చింది. అందుకని అనపోతు తిరిగి శ్యామాంగి దగ్గరకుపోయి "మాయన్న బాలచంద్రుడు మీ యింకు ముత్యాలమాల ముద్దుతుంగరం మరచిపోయి వారకు..వానికడిగి యిప్పించుక రమ్మన్నా"డని యడిగాడు.

శ్యామాంగి వకపకానవ్వి "మంత్రిగారబ్బాయి మా యింట్లో మరచి పోయిందేమీలేదు. మీరు వెంటనే భయచేయండి మా కింటిలో పనియున్న" దంటూ తలుపులు బిగించుకొని వెళ్ళిపోయింది.

అనుపోతు కది తీరని యవమానంగా తోచింది. వెనువెంటనే తిరిగి త్రిపురాంతకం పోయి చూచాడు. అక్కడ బాలచంద్రుడుగాని - వాని అనుచరులుగాని కనబడలేదు. వాని గుండె గుభేలుమన్నది. మాంచాల చెప్పిన మాటలు నిజములా అనిపించింది. అటు యిటు చూచాడు. రావిచెట్టు కొమ్మను గట్టివున్న ఉత్తరం చూచి చదివాడు. ఆయనకు తల తిరిగిపోయింది ఎన్ని పర్యాయములు చదివినా అవే మాటలు "అన్నయ్యా!" అని ఒక్కసారి బిగ్గరగా కేకవైచి కూలబడ్డాడు.

తనబోవు ముద్దలు తీర్థమంపాలు

బాలచంద్రా- నీ వింతపని చేస్తావనుకోలేదయ్యా? తోబుట్టిన తమ్మునిలాగా నిన్నెడబాయక తిరిగినానె గురిజాల వీరుల గుండెలు చీల్చిచెండాడి వీరబిరుదంబు పొందవేడుకబడిపచ్చినానె. బాలచంద్రునిప్రక్కన భండన భూమిలో వీరవిహారం చేయాలనుకొంటినె? నాకా యవకాశం లేకుండ చేశావెందుకు? నా శౌర్యం నీవెఱుగవా? నా స్వాంతము నీకు తెలియదా! నమ్మించినట్లు మోసం చేయడం నీకు న్యాయమా?

ఆయువుచాలక నేను యుద్ధమున చనిపోయిన నాడు బ్రహ్మహత్యాపాతకం సంభవించునను భయముననే యిట్లు చేసితివా? నీవేమి నన్ను పోరాటమునకు మొగమాట పెట్టితివా? లేదుగదా! నా బుద్ధిపూర్వకముగ నేను ప్రవేశించినపుడు ఫలా ఫలములకు నీవెట్లు బాధ్యుడవయ్యెదవు? నేను మరణించిన నీకు విప్రకుమార హత్యా పాతకమేల సంభవించును?

నేనారువేల నియోగి బ్రాహ్మణుండను. మా యింటిపేరు ఒడ్డేవారు. ఒరిస్సా ప్రాంతీయులమగుట ఓండ్ర శబ్దమునుండి కలిగినదే ఒడ్డేనామము. ఆనాటి మా తాత పెద్దనాన్నగారు నాకు యుద్ధమున ప్రఖ్యాతిగన్న వీరశేఖరులై యుండ నన్నెంత రణభీరునిగా నెంచితివయ్యా! మల్లమాంబ మల్లపరాజుల కుమారునకా తాతగారి పేరు డక్కుటయు నీకిష్టము లేకపోయినదా!

భారతయుద్ధంలో కౌరవుల పక్షమున మహాసైన్యాధిపతి పదవినహించి పద్మ వ్యూహము పన్నిన ద్రోణాచార్యుడు మా బ్రాహ్మణుడుకాడా? ఆ ద్రోణునకు బాల మరదియై కురుపాండవులకు కులగురువులైన కృపాచార్యుడు మా బ్రాహ్మణుడు కాడా! వారందరును యుద్ధమున నిలువంబడినపుడు బ్రాహ్మణహత్యాపాతకంబు కల్గునని వారెవరికిని గలుగని భయము నీకేల వచ్చినది? అదియునుగాక సత్యసంధుడని, ధర్మశీలుడని పేరుపొందిన ధర్మరాజంతవాడె తనపని నెరవేర్చుకొనుదలంచి పచ్చియబద్ధములాడి పూజ్య గురుదేవుడు పవిత్ర బ్రాహ్మణుడు నైన ద్రోణాచార్యుల వారికి తీరని యపకారం చేసిన మాటయైన నీ మనస్సుకు వచ్చి యుండలేదా?

నీ పురాణానుభవ మేమయింది ? నీ సోదరాభిమాన మేమయింది? నన్ను యుద్ధానికి రావలదని సందేశము మాత్రమే కాకుండా నాకానలు పెట్టి బంధించితివి. కది యేమి న్యాయము ? నీవు పెట్టిన యానలు మీరి నేనిపుడు యుద్ధమునకు రావలయునా! మానవలయునా! ఒక విధంబున చావునకు భయపడి నేటి యుద్ధము నకు రాకనుందునే యనుకొనుము. ముందొకనాటికైన మరణము తప్పనదియా? నీవనిసట్లు రణరంగమున జయాపజయములు దైవాధీనములు. నీకే మరణము సంభవించిన యెడల జీవించి మాత్రమేమి ప్రయోజనము? అయ్యయ్యో అంత మాటయే ? చెన్నకేశవుని దయవలన నీవు మరణింపరాదు. నిజముగా నీవు మరణింపరాదు. నిజముగా నీవు యుద్ధమున విజయము పొంది తిరిగి వచ్చిన పిదప నేనేపాటి వీరుండని సిగ్గులేక నీ మొగము చూచి మాటాడగలనా? ఎటు చూచినను నేనిపుడు చనిపోవుటయే మంచిదనిపించుచున్నది.

"చచ్చి స్వర్గమున నున్న మన బావ అలరాజు దగ్గరకు మీకన్న నేనే ముందు పోవుచున్నా"నంటూ పిడిబాకు డొక్కలో పొడుచుకున్నాడు. రక్తం ద్రవించింది. కన్నులు తేలిపోవుచున్న సమయంబున ప్రక్కన నిలవంబడి ఉన్న మాడచి పలుకరించి "ఎవరు! అనపోతువా! అయ్యో! బ్రాహ్మణ కుమారా! నిన్నీ రూపంలో చూస్తానని నేననుకోలేదు. ఎవరీ ఘోర కృత్యం చేశా"రని అడిగింది. అనపోతు మాడచితో "మాడచీ సమయానికి వచ్చావు తల్లీ! మేడపినుండి కారెమ్ము డి పోవుచున్నట్లున్నావు. నన్నెవరేమీ చేయలేదు. నేనే స్వయంగా కత్తితో పొడుచుకున్నాను. ఆ కారణం బాలచంద్రునికి తెలియును. ఇదిగో నీవీ యానవాలును గొనిపోయి బాలుని కందించి పుణ్యము గట్టుకొ"మ్మంటూ మెడలోని

జండెం తీసి నెత్తురు తడిపి దీనిని పిండిన రక్తంతో బాలుని నొసట వీరతిలకం పెట్టమని చెప్పుతూ ప్రాణాలు విడిచాడు.

మాడచి వెంటనే వీరమేడిపినుండి అనపోతు తల్లిదండ్రులను రావించి కుమారుని మృతకశేఖరమును దహనక్రియలకు నియమించిన తరువాత నాతడిచ్చిన జండెము నొకచిన్న పెట్టి యందుంచుకొని పోయి కాకెమపూడి యందున్న బాలుని చేతి కందించింది. జరిగినదంతా తెలుసుకొనిన బాలచంద్రుడిక ముద్ద నోట పెట్టలేకపోయాడు. వెనువెంటనే లేచి తన ముందున్న యన్నమును గంగాధర మడుగున గలుపుట చూచిన తోటివారంతా బాలచంద్రు ననుసరించారు. బాలచంద్రుడంతట ఎలుగెత్తి "సంధి జరుగదు, సమరమాగ"దని కేకలు పెట్టాడు. రణమోధులంతా కత్తులు దూశారు. రణభేరి మ్రోగింది.

సంధి కుదరని సంగ్రామము

బాలచంద్రుని యుత్తేజమంతకంతకు నినుమడించుచున్నది. మీరింకను సమరమునకు సందేహించు చున్నటులున్నారేమి? నేనుండగ మీకేమి భయము? నేనన నెవరు ననుకొనుచు చుంటిరి? అలనాడు అయోధ్యాపురాధీశ్వరుడై న హరిచంద్ర ధరణీశు నందనుండగు లోహితాశ్యుడను, నేను రాక్షస రాజేంద్రుడై న హిరణ్యకశిపునకు ప్రియకుమారుడనగు ప్రహ్లాదుడను, నేను- శివకంచిపురమునందు కీర్తి

నొందిన చిరుతొండనంబి కాత్మజుడనగు అంగదండును సిరియాళుడను నేను—కిష్కింధ పాలించిన వానరేశ్వరుండైన వాలి తనయుండనగు అంగదుండను నేను కౌరవుల దునుమాడి కురసామ్రాజ్యము నేలిన యుధిష్ఠిర సోదరుడైన అర్జున సుతుడనగు అభిమన్యుడను నేను, జన్మజన్మల యందు నేను బాలుడనై ఘనకార్యముల సాధింప ఉన్నాడను. ఇపుడీ పల్నాటి కృష్ణావతారమని ప్రఖ్యాతిగన్న బ్రహ్మనాయక మహామాత్యుల వారికి ఐతమ్మయందు జన్మించిన వరపుత్రుడనగు బాల చంద్రుడను నేను ముందుండ మీరు వెనుక ముందాడనేల" అని ధీరోచితంగా తోటి వారలను ప్రోత్సహించాడు.

ఆ మాటలాలకించిన వారిలో కొందరు "భళభళీ! బాలచంద్రా! నీ వంతటి వాడవేనయ్యా!" అని మెచ్చుకున్నారు. మరికొందరు యోచనా పరులు లోలోన నవ్వుకొని "రాజా బాలచంద్రా ! ఈ జన్మలో మొన మొన్న నీవు వీరమేడపికి మంత్రివైన జాధ్యతనే మరచిపోయావు, నీ తండ్రి యుద్ధానికి వచ్చిన మాట నీకు జ్ఞప్తియందు లేకపోయింది. "అమ్మా! మా నాన్నగారెక్కడికి పోయారని అడిగినా వటునె అంద మందమతికి గతించిపోయిన యుగాలనాటి యవతారముల చెప్పగల పూర్వజన్మ జ్ఞానమున్నదా! ఇంత జన్మ సంస్కారం కలవాడవు మాంచాలపట్ల నంత నసభ్యతల ప్రవర్తించెదవా!" అని అనుకుని కూడా "అయినా, యీ దుడుకు తనము గలవానితో మన కెందుకులె"మ్మని సరిపెట్టుకున్నారు.

బ్రహ్మనాయుడు కుమారుని దరిజేర్చుకొని "చెన్నా ! నిన్నా మేడపి యందుంచిరాగ మా వెంటనంటి వచ్చావు—సంధి ప్రయత్నం సాగనీయక పోయావు—సమరమున కందరను సన్నాహ మొనరించుచున్నావు, ఇంతవరకు

వచ్చితివి కావున నింక వెనుతీడవనవసరములేదు. చేసిన ప్రతిజ్ఞలు చెదరనీయకుము. గజఘింకారములకు, హయహేషణములకు, కాల్బలముల కోలాహలములకు కలవర పాటు చెందితివేని కదనమునందు నిలువజాలవు. పూర్వము మహాభారత సంగ్రామంబున అర్జునునంతటి అతిరథికుడే కౌరవసేనల చూచి కంపించిపోయాడు. బ్రహ్మనాయుని పుత్రుడవు-బాలచంద్రుడవైనందులకు కన్నతండ్రి కీర్తికి కళంకము రానీయక సమరం బొనరింపు"మని సందేశమందించాడు.

నాన్నగారూ! నన్ను గురించి మీరేల శంకించెదరు? బాలుడనని భయపడు చుంటిరా? కొదమ సింగపుపిల్ల మదపుటేనుగుల పైకెగసి కుంభస్థలంబుల గూడ చీల్చుట లేదా? బ్రహ్మనాయుని పుత్రునకు భండనభూమి భయము కల్గించినా, పగవారి సేనలచూచి పారిపోవుదునా! త్వరితంబుగ మీరు నన్ను తండ్రి దీవెనల నిచ్చివంపు"డనుచు తలవంచినదే తడవుగ శీలమ్మ కొడుకు చిరునవ్వు నవ్వి శంఖ తీర్థము నిచ్చి "కదనరంగమున నీకు ఘన విజయంబగునుగాక" అను ఆశీర్వ దించాడు.

రణభూమి కరుదెంచిన నరసింగరాజు

నలగామ భూపతి యాజ్ఞను పొంది, నాగమ్మ సూచనల ననుసరించి, సమర సన్నాహంబున బయలుదేరిన నరసింగరాజు గజారూఢుడై-గణగణ ధ్వనులు మిన్నుముట్టుచుండ కదనభూమికి కదలివచ్చాడు. మహాబలాఢ్యుడైన చొక్క జువ్వల వారు, నూరెలవారు, పదివేలమంది మారణాయుధముల ధరించి గజబలానికి ముందు నడచుచుండ-వీలుబట్టి యుద్ధమొనరించి నాలుగువేలమంది వీరులు తన్నమన

రించుచుండ-ఐదు అశ్వికదళం వెన్నంటి వచ్చుచుండ- వివిధాయుధంబుల ధరించిన మంది మార్బలం తండోపతండాలుగా తరలి వచ్చుచుండ-విజయపతాకలు నెగురుచుంత కొనగోటు కోరమీసము దువ్విన నరసింగభూపతి గర్జన పరవీరుల గుండెల నొకింత కలవరపరచింది.

ఆ దృశ్యము చూచిన బాలచంద్రునకు ఒడలుప్పొంగి అనుచరులతో గూడ పగతుల సేనలమీదికి లంఘించి దుమికాడు. చేతగల మారణాయుధములతో గురజాల సేనల చిందరవందరలు సేయుచు విజృంభించాడు. ఆ వీరవిహారమున కొందరకు ముక్కులు తెగినవి. కొందరకు భుజములూడినవి. కొందరకు చేతులు పోయినవి. కొందరకు డొక్కలు చీలి ప్రేగులు బయటపడినై. కొందరు కాళ్ళు తెగి పడిపోవుట చూచి మరింత సమరోత్సాహంతో గజబలం మీదికురికిన బాల చంద్రుడు కారడవిని కాల్చివేయు మహాగ్నిజ్వాలవలె యెక్కడికక్కడనే తార సిల్లుచు ఏనుగుల కొన్నింటి మస్తకంబుల చీల్చియు, కొన్నింటి దంతంబు లూడ దన్నియు, కొన్నింటి తొండంబుల నరికియు, కొన్నింటి చెవులగోసియు, కొన్నింటి మేనికండల చెండాడియు భీభత్సము చేయుచుండ నేనుగులు సైతము గీపెట్టి దిక్కు దిక్కులను పారజొచ్చినై చేజిక్కిన మావటీల గొంతులు గోయుచు ముందుకుసాగిన బ్రహ్మన్నపుత్రుడు అశ్వదళము నెదిరించి కొన్ని గుర్రముల గొంతులు నరకుచున్నందున నలగాముని పరివారమునందలివారు "వీడు బాలుడుకాడు- మా పాలిటి కాల యము"డని వానివంక కన్నెత్తియేనియు చూడలేకపోయారు.

పంకుల నంగ్రామరంగం కొంతసేపటికి కాలుచేతులు తెగినవారు-కన్ను ముక్కులు పోయినవారు, డొక్కలు చీలి-కండలు రాలిపడినవారు, నేల కొరిగియు

ప్రాణములు తల్లడిల్లువారు, చావసిద్ధమై బాధపడుచున్నవార, చచ్చిపడిపోయిన వారు, గొంతెత్తి బిగ్గరగ వాపోవువారు. ఏడ్వనైనా వోపికలేక బాధపడుచున్నవారి ప్రాణాలను కాపాడుకొన పారిపోవుచు పడియున్నవారిని ద్రొక్కుకొని పరుగెత్తు వారితో రణభూమియంతయు భయానక దృశ్యము దాల్చింది.

సైన్యములో క్రొత్తగా చేరినవారికి యుద్ధరంగము తెలియనివారున్నారు. వారంతా కడుపు నింపుకొనడానికి కూలికాసించి వచ్చినవారేకాని కత్తిదూసి పోరాడగల గుండెధైర్యం కలవారుకాదు. వారికి యుద్ధములో మెలకువలు తెలియవు ధైర్యసాహసములు మొదటినుండియు నుండవు. అట్టివారివలన ప్రభువుల కపజయమేగాక అపఖ్యాతియు కల్గుట సహజము. అట్టి పిరికిపెధవలు బాల చంద్రుని పాటాటోపం చూచి భయపడిపోయారు. "ఊపిరియున్న నుప్పుకల్లమ్ము కొని బ్రతకవచ్చు" నను నిర్ణయానికి వచ్చారు. బ్రతికి ఐయటపడేదెలాగాయని దిక్కులు చూచారు. కొందరు ప్రక్కప్రక్కలకు పారిపోయారు. కొందరక్కడక్కడనే నక్కియున్నారు. కొందరు పాదాక్రాంతులై చేతులను జోడించి "ప్రభూ! మాకేమి తెలియదు. మమ్ములను ప్రాణాలతో విడిచిపెట్టండి. మా కొంపలకుపోతా" మని ప్రాధేయపడ్డారు.

గురజాల సేనలు పల్నాటినై.

నరసింగరాజు పట్టుదల విడనాడక పారిపోవుచున్న వారి నుద్దేశించి "వీరులారా! మరచి పోకండి. మనమందరం పెండ్లికివచ్చిన పెద్దలముకాము. శత్రువులను

వంపుటో, శత్రువుల చేతులలో చచ్చుటకో వచ్చిన సంగ్రామ యోధులము. నేడు గాకపోయిన యింకొకనాటికై నను మనలను విడిచిపెట్టని మరణమునకై భయపడు టెందులకు? పారిపోయి యేమిచేయుదురు? మేమందరము మీ వంటి మనుషులము కామా?- మాకు ప్రాణములమీద తీపిలేదా! మాకు భార్యబిడ్డలులేరా? మా వలనే తెగించిరండి. మరణమునో, విజయమునో యిచట పొందండి" అని ప్రోత్సహింప తప్పించుకొని పోదెంచిన వీరులంతా తిరిగి వీరత్వమున విజృంభించి మాచర్లసేనల నెదిరించి పోరాడసాగారు.

శత్రుసేనలు చాలవరకు సమసినవి- సమర భారం తగ్గినదనుకున్న బాల చంద్రునకు మళ్ళీ తీరని పనికల్గింది. యుద్ధం భయంకరరూపం దాల్చింది.

నరసింగరాజు బాలచంద్రుల మరణము

అంతకంతకు రోషమతిశయించుచున్న బాలచంద్రుడు "ఏడి నరసింగుడు ఎక్కడున్నా"డనుచు ముందు కురికి యెదురైన వీరుల దునుమాడుచు గజబలం మీదకు గంతువైచాడు. అడ్డువచ్చిన కేరళదేశాధీశ్వరుని కరవాలమున పొడిచి చంపాడు. కర్ణాటక మండలేశ్వరుని సంహరించాడు. మాళవాధిపతిని మస్తకం తెగ వేశాడు. బర్బరపురీశ్వరుని చేతులు నరికివేశాడు. అటు మీద నరసింగరనాథుని హుటాహుటి నెదిరించి పోరాడాడు. నరసింగరా జెక్కిన మదకరీంద్రము బాలుని మీదికి రాబోయింది. బాలుడు దానిని తప్పించుకొని చివాలున గజము మీదికి

లంఘించి నరసింగుని దాకాడు. వారిరుది పోరాటము చూచువారికి కర్ణార్జునులో, వృతదేవేంద్రులో, రామరావణులో యన్నట్లు వీరరసప్రధానమై కన్పించింది.

ఆ సమయంబున వెంకు అను వీరుడు నరసింగరాజున కంగరకుకుడుగ వచ్చి యెదిరించాడు. ఆవేశములోనున్న బాలచంద్రుడు తొందరలో వెంకు తల నరికికొని తండ్రియొద్దకు పోయాడు. బ్రహ్మనాయుడు పోల్చిచూచి ఇది నరసింగుని తలకాదని చెప్పినందున బాలుడు మళ్ళి యుద్ధరంగంలో ప్రవేశించి నరసింగుని మీద తలపడ్డాడు. నరసింగ బాలచంద్రులకు రెండవసారికూడ భయంకర సంగ్రామం జరిగింది. నరసింగుడదనుచూచి బాలుని డొక్కలో కత్తితో పొడిచాడు. దెబ్బతిన్న బాలచంద్రుడు తోకత్రొక్కిన త్రాచులా వీరావేశమొంది నరసింహుని తల తెగ వేశాడు. తన కడుపునుండి జారిన ప్రేవుల నొకచేత నదిమిపట్టుకొని బాలచంద్రుడు నరసింగరాజ శిరమును రెండవచేత బట్టుకొచివచ్చి శిబిరము నందున్న తండ్రి పాద ముల యందుంచి యిక నాపని పూర్తియైనదన్నట్లుగా సమీపమునందే నేలకొరిగి ప్రాణాలను విడిచాడు.

అంతటితో సాయం సమయమయింది. యుద్ధం ముగిసింది.